



లగేజీ స్కానర్లు పనిచేయకపోవడంతో మాన్యువల్‌గా తనిఖీ - లగేజీ తనిఖీల కోసం భక్తుల నిరీక్షణ

అలిపిరిలోనే దేవుడు కనిపించాడు

తిరుమలకు వెళ్లే భక్తుల లగేజీకి అలిపిరి చెక్‌పాయింట్‌లో తనిఖీ తప్పనిసరి. సోమవారం ఉదయం 6.55 గంటలకు ఆరు స్కానర్లూ పనిచేయలేదు. విద్యుత్తు సరఫరా ఆగడం.. సర్వర్లు పనిచేయకపోవడం కారణమని చెబుతున్నారు. దీంతో భక్తులు తమ లగేజీ తనిఖీ చేయించుకోవడానికి ఎక్కువ సమయం నిరీక్షించాల్సి వచ్చింది. చివరకు ఏవీఎస్వో రమేష్, విజిలెన్సు ఇన్‌స్పెక్టర్ పురుషోత్తం రంగంలోకి దిగి అదనపు సిబ్బందితో లగేజీ బ్యాగులను తనిఖీ చేయించారు. దీంతో ఆలస్యం కావడంతో వాహనాలు బారులు తీరాయి. 9.30 గంటల వరకు ఇదే పరిస్థితి. తనిఖీల కోసం ఎక్కువ సమయం నిరీక్షించాల్సి రావడంతో భక్తులు అసహనానికి గురై సిబ్బంది ఆగ్రహం వ్యక్తంచేశారు. ఆ తర్వాత లగేజీ స్కానర్లు పనిచేయడంతో యథావిధిగా తనిఖీలు జరిగాయి.

- తిరుపతి(నేరవిభాగం), ఆంధ్రజ్యోతి

నమ్మకమే సగం వైద్యం

నేడు జాతీయ వైద్యుల దినోత్సవం



తిరుపతి(వైద్యం), జూన్ 30 (ఆంధ్రజ్యోతి): దేవుడు జన్మనిస్తే డాక్టరు పునర్జన్మనిస్తాడని అంటారు. అందుకే 'వైద్యోనారాయణో హరి' అనే పదం ప్రాచుర్యంలోకి వచ్చింది. ఈ దిశగా తమపై ప్రజల్లో నమ్మకాన్ని పెంచేలా వైద్యులు కృషి చేయాల్సి ఉంటుంది. ఇక డాక్టరుపై రోగికి నమ్మకం ఉంటే.. సగం జబ్బు నయమైనట్లే. అదే విధంగా రోగి కూడా వైద్యులపై నమ్మకం పెట్టుకోవాలి. ఇద్దరి మధ్య విశ్వాసం ఉంటేనే.. ఆరోగ్యకర వాతావరణం సాధ్యమవుతుంది. ఇటువంటి అద్వితీయ అనుబంధాన్ని బలోపేతం చేసుకునేందుకు వైద్యుల దినోత్సవం కన్నా మంచి తరుణం దొరకదు. జీవితకాలం దేశీయ వైద్యరంగంలో మౌళిక సదుపాయాలను మెరుగుపరిచేందుకు అవిశ్రాంతంగా కృషి చేసిన భారతరత్న పురస్కార గ్రహీత డాక్టర్ బీసీరాయ్ స్మారకార్థం 1991 నుంచి ఏటా జూలై ఒకటో తేదీన జాతీయ వైద్యుల దినోత్సవం నిర్వహిస్తున్నారు. ఆయన్ను గుర్తుచేసుకుంటూ నివాళులు అర్పించడమే కాకుండా ఆయన అడుగుజాడల్లో నడుస్తూ తమ వైద్యపరమైన నైపుణ్యాలతో రోగుల ప్రాణాలను నిలబెట్టేలా నిస్వార్థమైన సేవలను అందించే డాక్టర్లను ఎప్పటికీ దేవుళ్లుగానే చూస్తారు.

రోగుల ఆరోగ్య భద్రతే లక్ష్యంగా..



ప్రభుత్వాస్పత్రికి వచ్చే వారిలో ఎక్కువగా నిరుపేదలే ఉంటారు. ఇక్కడి డాక్టర్లపై ఉన్న నమ్మకంతోనే వస్తారు. అటువంటి వారి ఆరోగ్య భద్రతే లక్ష్యంగా వైద్యసేవలు అందిస్తున్నాం. రోగులకు వైద్యంతోపాటు వారిలో మానసిక దృఢత్వాన్నీ పెంపొందించేలా వారితో మాట్లాడాలని ఆస్పత్రిలోని డాక్టర్లకు నిత్యం చెబుతున్నాం. అదే తరహాలో రోగులతో డాక్టర్లు మలుచుకుంటూ వైద్య సేవలు అందిస్తున్నారు. వైద్యవృత్తిలో రాణించే అవకాశం నాకు దొరకడం అదృష్టంగా భావిస్తున్నా. నా వంతుగా నిత్యం రోగులకు మెరుగైన వైద్యసేవలు అందించి వారి నమ్మకాన్ని నిలబెట్టేలా కృషి చేస్తా. అదే విషయాన్ని నాతోటి డాక్టర్లకు చెబుతుంటా.

- డాక్టర్ రాధ, రుయాస్పత్రి సూపరింటెండెంట్

ప్రభుత్వాస్పత్రుల్లో నిస్వార్థంగా వైద్యసేవలు



ఇతరుల ప్రాణాలను కాపాడగలిగే గొప్ప అవకాశం ఒక్క డాక్టర్లకే ఉంటుంది. అటువంటి వృత్తిలో రాణించడమనేది గత జన్మ పుణ్యఫలంలా భావించాలి. ఈ వృత్తిని వ్యాపారంగా చూడకూడదు. దురదృష్టవశాత్తు ప్రస్తుతం రోగులకు నిస్వార్థ సేవలు అందించాలనే ఆలోచనతో వచ్చే వారికంటే వైద్య వ్యాపారం బాగుంటుందని ఈ వృత్తిలో అడుగు పెట్టే వారే ఎక్కువ. అందువల్లే ప్రజలకు వైద్యులపై నమ్మకం సన్నగిల్లుతోంది. కానీ నిస్వార్థంగా వైద్యసేవలు అందించే వాళ్లూ ఉన్నారనే విషయాన్ని ప్రజలు కూడా విశ్వసించాలి. కార్పొరేట్ ఆస్పత్రుల విషయం పక్కన పెడితే ప్రభుత్వాస్పత్రుల్లో డాక్టర్లు మాత్రం నూరు శాతం ప్రజల ఆరోగ్య భద్రత కోసమే కృషి చేస్తున్నారనేది సత్యం.

- డాక్టర్ బాలకృష్ణనాయక్, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి

ప్రజల్లో నమ్మకాన్ని పెంచాలి



వైద్యవృత్తిలో అడుగు పెట్టే విద్యార్థులు ప్రజల ప్రజల్లో నమ్మకాన్ని పెంచేలా రాణించాలి. అందుకనే వైద్య విద్యార్థులకు కేవలం వైద్యపరంగానే కాకుండా వైద్యుల నైతిక విలువలు, సమాజంలో వైద్యుల పాత్ర వంటి విషయాలపై ఎప్పటికప్పుడు వివరిస్తూ ప్రముఖులతో అతిథి ఉపన్యాసాలు కొనసాగిస్తున్నాం. వైద్య వృత్తి అనేదే దేవుడు మనకు ఇచ్చిన ఒక వరం. అటువంటి వైద్యులను తీర్చిదిద్దే అవకాశం కల్పించడం నిజంగా నా గత జన్మ సుకృతం. నాకు కల్పించిన ఈ అవకాశాన్ని తప్పక సద్వినియోగం చేసుకోవడంతోపాటు నైతిక విలువలు కలిగిన వైద్యులను సమాజానికి అందించేందుకు కృషి చేస్తాను.

- డాక్టర్ రవిప్రభు, ఎస్వీ వైద్య కళాశాల ప్రిన్సిపాల్



రాయుడు మిలటరీ హోటల్‌లో వేసిన నమూనా ఆలయ సెట్టింగ్



అదనపు ఈవో వెంకయ్య చౌదరికి వినతిపత్రం అందజేస్తున్న కిరణ్ రాయల్

రాయుడు మిలటరీ హోటల్‌లో శ్రీవారి గర్భాలయ నమూనా సెట్

- మాంసాహారం విక్రయిస్తున్న హోటల్‌పై చర్యలు తీసుకోండి
- టీటీడీ అదనపు ఈవోకు కిరణ్‌రాయల్ ఫిర్యాదు

తిరుమల, జూన్30(ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారి గర్భాలయ తరహాలో నమూనా ఆలయ సెట్టింగు వేసి నాన్‌వెజ్ విక్రయిస్తున్న రాయుడు మిలటరీ హోటల్‌పై చర్యలు తీసుకోవాలని తిరుపతి జనసేన నేత కిరణ్‌రాయల్ కోరారు. ఈ మేరకు సోమవారం ఆయన తిరుమలలో టీటీడీ అదనపు ఈవో వెంకయ్య చౌదరికి వినతిపత్రాన్ని అందజేశారు. తిరుమల శ్రీవారి ప్రతిష్ఠను వ్యాపారాలకు వాడుకుంటున్న వారిపై తక్షణమే తగిన చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ.. రాజమండ్రి నుంచి వైజాగ్‌కు వెళ్లే హైవేలో రాయుడు మిలటరీ హోటల్‌లో శ్రీవారి గర్భాలయ నమూనా సెట్టింగ్ వేశారన్నారు. అందులో జయ విజయలతో పాటు శ్రీవారి విగ్రహాన్నీ ఏర్పాటు చేయడం దారుణమన్నారు. 'తిరుమల అన్నప్రసాదం తరహాలోనే మేమూ పెడుతున్నాం అని ఆ హోటల్ నిర్వాహకుడు అంటున్నాడు. ఓరెయ్ వెదవ. మేము నాన్‌వెజ్ పెడుతున్నామా? ప్యూర్ వెజిటేరియన్ పెడుతున్నాం. వేంకటేశ్వర స్వామి భక్తులంటే ఎలా కనిపిస్తున్నారు నీకు' అంటూ ఆ హోటల్ నిర్వాహకుడిపై ఆగ్రహం వ్యక్తంచేశారు. ఆ హోటల్‌లో నాన్‌వెజ్ వాసన వస్తుంటే.. మరో వైపు నమూనా సెట్టింగులో శ్రీవారి విగ్రహానికి హారతి ఇస్తున్నారంటూ ఆవేదనతో అమెరికా, జర్మనీ దేశాల్లోని భక్తుల నుంచీ తమకు వీడియోల సహా ఫిర్యాదులు వస్తున్నాయని తెలిపారు. 24 నుంచి 48 గంటల్లోపు ఆలయ నమూనాను తొలగించకుంటే శ్రీవారి భక్తులు దాడి చేస్తారని హెచ్చరించారు. టీటీడీలో ప్రత్యేకంగా ఓ వింగ్‌ను ఏర్పాటు చేసి సోషల్ మీడియాపై నిఘా ఉంచాలని కోరారు. ఫుడ్ కార్పొరేషన్ అధికారులతోనూ టీటీడీ అధికారులు మాట్లాడారని, రాయుడు మిలటరీ హోటల్ లైసెన్స్‌ను రద్దు చేయిస్తామన్నారు.

డీసీసీబీ, సీడీసీఎంఎస్ చైర్మన్ల పదవీకాలం పొడిగింపు

చిత్తూరు కలెక్టరేట్, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): జిల్లా సహకారకేంద్ర బ్యాంకు చైర్మన్ డీసీసీబీ) అమాస రాజశేఖర్‌రెడ్డి, జిల్లా సహకార మార్కెటింగ్ సొసైటీ చైర్మన్ (డీసీఎంఎస్) పి. సుబ్రహ్మణ్యం నాయుడు పదవీకాలాన్ని ఆరునెలల పాటు పొడిగిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. గతనెల 26వ నుంచి నెలకు మాత్రమే అవకాశం కల్పించిన ప్రభుత్వం ఈనెల 27 నుండి డిసెంబరు 26 వరకు పదవీకాలాన్ని పొడిగిస్తూ సోమవారం ఉత్తర్వులు జారీచేసింది.

నేడు 2,59,732 మందికి పింఛన్ల పంపిణీ

తిరుపతి(కలెక్టరేట్), జూన్ 30(ఆంధ్రజ్యోతి): ఎన్టీఆర్ భరోసా సామాజిక భద్రతా పింఛన్లు జులై నెలకు సంబంధించి మంగళవారం సచివాలయ సిబ్బంది లబ్ధిదారులకు పంపిణీ చేయనున్నారు. జిల్లాలో 2,59,732 మందికి గాను ప్రభుత్వం రూ.111.45కోట్లు కేటాయించింది. ఉదయం 6 గంటలకు 691 సచివాలయాల పరిధిలో ఇంటింటికి వెళ్లి సచివాలయ ఉద్యోగులు పింఛన్లు పంపిణీ చేయనున్నారు.

రైళ్లలో చోరీలు, దోపిడీలు అరికట్టండి

రైల్వే పోలీసులకు డీఐజీ సత్యఏసుబాబు ఆదేశం

తిరుపతి(నేరవిభాగం), జూన్ 30(ఆంధ్రజ్యోతి): తిరుపతి సబ్ డివిజన్ పరిధిలో రైళ్లలో దొంగతనాలు, దోపిడీల నివారణకు కలిసికట్టుగా పనిచేయాలని విజయవాడ రైల్వే డీఐజీ సత్యఏసుబాబు ఆదేశించారు. రైళ్ల దొంగతనాలు, సిగ్నల్ ట్యాంపరింగ్‌లపై ఆయన అసహనం వ్యక్తం చేశారు. సోమవారం విజయవాడ నుంచి తిరుపతి రైల్వే అధికారులతో టెలికాన్ఫరెన్సు నిర్వహించారు. నేరాల కట్టడికి ఎలాంటి చర్యలు తీసుకున్నారు? ఎన్ని కేసులు నమోదు చేశారు? బ్యాగ్ లిఫ్టర్లు, మొబైల్ దొంగలు ఎంతమందిపై కేసులు పెట్టారు? రోజూ ఎంతమంది గస్తీ చేస్తున్నారనే వివరాలు తెలుసుకున్నారు. తిరుపతి రైల్వే స్టేషన్‌లో నిఘా పటిష్ఠం చేయాలని ఆదేశించారు. రాత్రి బీట్లు గట్టిగా చేస్తే దొంగలకు భయం కలుగుతుందన్నారు. ఎక్కడ దొంగతనాలు, దోపిడీలు జరిగినా సంబంధిత అధికారులే బాధ్యత వహించాలన్నారు. తిరుపతి రైల్వే స్టేషన్‌లో నేరాల కట్టడి, బ్యాగ్ లిఫ్టర్లు, మొబైల్ దొంగతనాల నివారణకు తీసుకున్న చర్యలపై సీఐ ఆశీర్వాదం వివరించారు.

650 మంది వైద్యుల రిజిస్ట్రేషన్ రెన్యువల్

తిరుపతి(వైద్యం), జూన్ 30(ఆంధ్రజ్యోతి): ఎస్వీ వైద్య కళాశాలలో రెండు రోజులుగా నిర్వహించిన డాక్టర్ల రిజిస్ట్రేషన్, రెన్యువల్ కార్యక్రమంలో భాగంగా 650 మంది వైద్యులు రిజిస్ట్రేషన్, రెన్యువల్, ఎన్‌వోసీలు నమోదు చేసుకున్నట్లు ఏపీ వైద్య మండలి చైర్మన్ డాక్టర్ దగ్గుమాటి శ్రీహరిరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇదే తరహాలో మళ్లీ ఆరు నెలల తరువాత ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తామని పేర్కొన్నారు. వైద్యులు ఎప్పటికప్పుడు వారి ధ్రువపత్రాలను రిజిస్ట్రేషన్, రెన్యువల్ చేసుకోవాలని ఆయన వివరించారు.



కలెక్టర్‌ను ఆశీర్వదిస్తున్న సాధువులు

సగం సమస్యలు రెవెన్యూవే

తిరుపతి కలెక్టరేట్‌లో పీజీఆర్ఎస్‌కు వచ్చిన సమస్యల్లో సగం రెవెన్యూ శాఖవే. మొత్తం 296 వినతులకు గాను 145 ఆ శాఖకు సంబంధించినవే. ప్రతి వారం ఇదే పరిస్థితి. కాగా, అర్జీల స్వీకరణ సందర్భంగా ఉత్తరప్రదేశ్‌కు చెందిన ముగ్గురు సాధువులు అక్కడికి వచ్చి కలెక్టర్‌ను ఆశీర్వదించారు. అక్కడి వారికి రుద్రాక్షలు పంచారు.

- 8లో



ఈ బైక్ షోరూమ్‌లో అగ్నిప్రమాదం

తిరుపతి(నేరవిభాగం), జూన్ 30(ఆంధ్రజ్యోతి): తిరుపతి నగరం రేణిగుంట రోడ్డులోని జాయ్ ఎలక్ట్రిక్ ద్విచక్ర వాహన షోరూములో సోమవారం అగ్ని ప్రమాదం సంభవించింది. విద్యుత్ షార్టు సర్క్యూట్ కారణంగా మంటలు వ్యాపించాయి. వెంటనే అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి వెళ్ళి మంటలను అదుపు చేశారు. అప్పటికే షోరూములోని ఫర్నిచర్, 10 ఈ- బైక్‌లు కాలిపోయాయి. ఈ ఘటనలో దాదాపు రూ 20.లక్షల ఆస్తి నష్టం సంభవించినట్లు అగ్నిమాపక సహాయ సంచాలకుడు కిరణ్‌కుమార్ రెడ్డి తెలిపారు.

ఈ-సిమ్ పేరుతో టోకరా

- రూ.1.90 లక్షలు కాజేసిన సైబర్ నేరగాళ్లు

తడ, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): సైబర్ నేరగాళ్లు ఓ మహిళ ఖాతాలో నుంచి రూ.1.90 లక్షలు కాజేశారు. తడ మండల పరిధిలోని పెరియవట్టు గ్రామానికి చెందిన ఈదూరు శ్రీదేవికి స్థానిక కెనరా బ్యాంక్‌లో ఖాతా ఉంది. పది నెలల క్రితం పొదుపు సంఘం ద్వారా రూ.2 లక్షల రుణం తీసుకుంది. ఇంటి నిర్మాణానికి ఖర్చు చేద్దామన్న ఉద్దేశంతో ఆ డబ్బును ఖాతాలోనే ఉంచింది. బ్యాంక్ ఖాతాకు ఆమె కుమారుడు లోకనాథం ఫోన్ నెంబరును జత చేసింది. ఇదిలా ఉండగా గత శనివారం లోకనాథం ఫోన్‌కు ఈ-సిమ్ కావాలంటే తమను సంప్రదించాలంటూ ఎస్ఎంఎస్ ద్వారా ఈ లింక్ వచ్చింది. లోకనాథం ఆ లింక్‌ను క్లిక్ చేయడంతో కొద్ది నిమిషాల తరువాత ఫోన్ హ్యాంగ్ అయింది. వెంటనే ఓటీపీ వచ్చింది. ఆ ఓటీపీ సెండ్ చేస్తే మీ ఫోన్ సాధారణ స్థితికి వస్తుందంటూ మరో మెసేజ్ రావడంతో లోకనాథం ఆ ఓటీపీని అలాగే ఫార్వాడ్ చేశాడు. అప్పటి నుంచి ఆదివారం వరకు అతని ఫోన్ పనిచేయలేదు. సోమవారం బ్యాంక్ ఖాతా నుంచి రూ.25వేలు నగదు డ్రా చేసినట్లుగా మెసేజ్ రావడంతో లోకనాథం ఖంగుతిన్నాడు. వెంటనే తల్లిని తీసుకొని బ్యాంక్‌కు వెళ్లి విచారించగా తన ఖాతాలో ఉండాల్సిన రూ.1.90 లక్షలు మరో అకౌంట్‌లోకి వెళ్లిపోయినట్లు బ్యాంక్ అధికారులు చెప్పారు. దీంతో లబోదిబోమంటూ సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

సర్వేయర్ల బదిలీ కౌన్సెలింగ్‌లో గందరగోళం

సీనియారిటీ జాబితాలో మార్పుపై నిరసన ● రెండు గంటలపాటు నిలిచిన ప్రక్రియ



సర్వేయర్ల బదిలీ ప్రక్రియలో వాగ్వాదం

చిత్తూరు కలెక్టరేట్, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): గ్రామ, వార్డు సచివాలయాల సర్వేయర్లకు ఆది, సోమవారాల్లో బదిలీలు జరిగాయి. చిత్తూరు, తిరుపతి, అన్నమయ్య జిల్లాల్లోని 520 మందికి గాను 398 మందికి బదిలీల కౌన్సెలింగ్ పూర్తయ్యింది. కలెక్టరేట్‌లోని మీటింగ్ హాలులో జరిగిన కౌన్సెలింగ్‌కు మూడు జిల్లాల అధికారులు, హాజరయ్యారు. ఐదేళ్ల సర్వీసు పూర్తిచేసిన వారిని బదిలీ చేశారు. సొంత మండలాలు కాకుండా పక్కనే ఉన్న మండలానికి పంపించారు. ర్యాంకుల ఆధారంగా ఈప్రక్రియ జరగ్గా, అధికారుల తప్పిదాల వల్ల తిరుపతి జిల్లాకు బదిలీ కావాల్సినవారు చిత్తూరు జిల్లాకు, చిత్తూరు జిల్లాకు బదిలీ కావల్సిన వారు తిరుపతి జిల్లాకు బదిలీ అయ్యామంటూ ఆరోపించారు. సోమవారం గందరగోళం మధ్య కౌన్సెలింగ్ సాయంత్రం వరకు కొనసాగింది. పలుసార్లు సీనియారిటీ జాబితాలో మార్పులు చోటుచేసుకున్నాయి. దాంతో సర్వేయర్లకు తెలియకుండా, జాబితా ప్రచురించకుండానే జరిగిన కౌన్సెలింగ్‌లో కొందరు తమకు అనుకూలమైన సర్వేయర్లకు స్థానాలు కేటాయించేందులో అధికారులు అడ్డదారులు తొక్కారంటూ పలువురు అడ్డుకున్నారు. అధికారులకు వ్యతిరేకంగా కొందరు నినాదాలు చేశారు. ఫలితంగా మధ్యాహ్నం రెండు గంటలపాటు కౌన్సెలింగ్ ఆగిపోయింది. మధ్యాహ్నం 3 గంటల నుంచి కౌన్సెలింగ్ ప్రక్రియను పునఃప్రారంభించి 5 గంటలకు ముగించారు. కౌన్సెలింగ్‌లో చిత్తూరు జిల్లా సర్వేశాఖ ఏడీ జయరాజ్, అన్నమయ్య జిల్లా ఏడీ భరత్‌కుమార్, సూపరింటెండెంట్ రాజేంద్ర, తిరుపతి జిల్లా సూపరింటెండెంట్ చంద్రిక తదితరులు పాల్గొన్నారు.

చంద్రగిరి

అభివృద్ధిలో చంద్రగిరి మరో ముందడుగు

● క్రీడా వికాస్ కేంద్రానికి భూమిపూజ



భూమి పూజ చేస్తున్న ఎమ్మెల్యే నాని, రవినాయుడు

చంద్రగిరి, జూన్ 30(ఆంధ్రజ్యోతి): అభివృద్ధిలో చంద్రగిరి మరో ముందడుగు వేసింది. గత వైసీపీ ప్రభుత్వంలో నిర్లక్ష్యంగా వదిలేసిన నిర్మాణ పనులను పూర్తి చేసేందుకు ప్రస్తుత పాలకులు నడుం బిగించారు. 2017లో రూ.2 కోట్లతో క్రీడాకారుల కోసం ఇండోర్ స్టేడియం పనులు ప్రారంభించారు. తర్వాత వచ్చిన వైసీపీ ప్రభుత్వంలో సంబంధిత కాంట్రాక్టర్‌కు బిల్లులు చెల్లించక పోవడంతో పనులు అసంపూర్తిగా నిలిచిపోయాయి. కూటమి ప్రభుత్వం రాగానే రూ.1.53 కోట్లతో పనులు పునఃప్రారంభించారు. ఈ పనులకు సోమవారం శాప్ ఛైర్మన్ అనిమిని రవినాయుడు, ఎమ్మెల్యే పులివర్తి నాని భూమిపూజ చేశారు. రవినాయుడు మాట్లాడుతూ ఎమ్మెల్యే నాని పట్టుదలతో ప్రభుత్వం ఈ స్టేడియం పునర్నిర్మాణానికి రూ.1.53 కోట్లు మంజూరు చేసినట్లు తెలిపారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ అభివృద్ధి అంటే చెట్ల కింద బెంచీలు వేయటం, రోడ్ల పక్కన బోర్డులు పెట్టడం, సొంత కంపెనీలకు రోడ్లు వేయడం, సొంత మనుషులకు పట్టాలు ఇవ్వడం కాదని, ప్రజల జీవితాలను మెరుగుపరిచే విధంగా ఉండాలని అన్నారు. శాప్ బోర్డు సభ్యులు రజినీ, డీఎస్‌డీవో శశిధర్, కాంట్రాక్టర్ శివారెడ్డి, అధికారులు, పీఈటీలు, నాయకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కల్యాణ వెంకన్న సాక్షాత్కార వైభవోత్సవాలు ప్రారంభం



పెద్దశేష వాహనంపై దర్శనమిస్తున్న కల్యాణ వెంకన్న

చంద్రగిరి, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): శ్రీనివాసమంగాపురంలో వెలసిన కల్యాణ వేంకటేశ్వరస్వామివారి ఆలయంలో సాలకట్ల సాక్షాత్కార వైభవోత్సవాలు సోమవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. మూడు రోజుల పాటు జరుగనున్న ఈ వేడుకల్లో ఉదయం సుప్రభాతంతో స్వామివారిని మేల్కొలిపి, తోమాలసేవ, కొలువు, పంచాంగ శ్రవణం, సహస్రనామార్చన నిర్వహించారు. 10 నుంచి 11 గంటల వరకు ఆలయ ముఖ మండపంలో శ్రీదేవి, భూదేవి సమేత కల్యాణ వేంకటేశ్వరస్వామి ఉత్సవర్లకు స్నపన తిరుమంజనం నిర్వహించారు. పాలు, పెరుగు, తేనె, పసుపు, చందనం, కొబ్బరినీళ్లతో అభిషేకం చేశారు. రాత్రి 7 గంటలకు స్వామివారి ఉత్సవమూర్తిని విశేషంగా అలంకరించి పెద్దశేష వాహనంపై ఊరేగించారు. రెండో రోజు మంగళవారం హనుమంత వాహనంపై, మూడో రోజు బుధవారం గరుడ వాహనంపై స్వామివారు భక్తులను అనుగ్రహించనున్నారు. గురువారం పార్వేట ఉత్సవం జరగనుంది. కార్యక్రమంలో ఆలయ ప్రత్యేక శ్రేణి డెప్యూటీ ఈవో వరలక్ష్మి, ఏఈవో గోపినాథ్, సూపరింటెండెంట్లు రమేష్‌కుమార్, రాజ్‌కుమార్, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ మునికుమార్, అర్జితం ఇన్‌స్పెక్టర్ ధనశేఖర్, అర్చకులు బాలాజీరంగాచార్యులు, శేషాచార్యులు, పార్థసారథి, నారాయణాచార్యులు పాల్గొన్నారు.

కోటిలింగేశ్వరస్వామి సేవలో కంచి పీఠాధిపతి



కోటిలింగేశ్వరస్వామికి అభిషేకం చేస్తున్న కంచి పీఠాధిపతులు

రామచంద్రాపురం, జూన్ 30(ఆంధ్రజ్యోతి): రాయలచెరువు కామాక్షి సమేత కోటి లింగేశ్వర స్వామిని సోమవారం కంచి కామకోటి పీఠాధిపతి శంకర విజయేంద్ర సరస్వతి, ఉత్తరాధికారి సత్య చంద్రశేఖర సరస్వతి దర్శించుకున్నారు. వీరికి ఆలయ నిర్వాహకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. స్వయంగా కోటి లింగేశ్వరస్వామి, జలకంఠేశ్వరస్వామికి తిరుమంజనం నిర్వహించారు. కామాక్షి అమ్మవారికి కుంకుమార్చన నిర్వహించి భక్తులకు ప్రసాదాలు అందజేశారు. అనంతరం విజయేంద్ర సరస్వతి భక్తులనుద్దేశించి మాట్లాడుతూ కామాక్షి అమ్మవారి దయ ఉంటే కోరికలు నెరవేరుతాయన్నారు. ప్రాణయోగ ఆశ్రమం పీఠాధిపతి కైలాష్, ఆలయ సలహాదారు రామకృష్ణశర్మ, నిర్వాహకులు మురళీకృష్ణ దంపతులు, విశ్రాంత టీటీడీ ఉద్యోగి భాస్కర్‌నాయుడు, విశ్రాంత ఇన్‌కంట్యాక్స్ అసిస్టెంట్ కమిషనర్ ఏపీనాయుడు పాల్గొన్నారు.

దళితుల సమస్యల పరిష్కారమే లక్ష్యం



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్ఐ జానకీరామ్

భాకరాపేట, జూన్ 30(ఆంధ్రజ్యోతి): దళితుల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా పనిచేయాలని మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ జానకీరామ్ అన్నారు. చిన్నగొట్టిగల్లు మండలం నెల్లుట్లవారిపల్లె పంచాయతీ ఉలవపాటివారిపల్లెలో సోమవారం ఎస్సీ, ఎస్టీ మానిటరింగ్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ దళితుల పట్ల వివక్ష చూపితే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. దళితుల భూమి, దారి సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. తమకు హౌసింగ్ బిల్లులు రాలేదని తెలపగా అధికారులతో మాట్లాడి చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో వీఆర్వో చలపతి పాల్గొన్నారు.

మూట్‌కోర్ట్ పోటీల విజేతలకు బహుమతుల ప్రదానం



నగదు బహుమతి, ట్రోఫీతో విద్యార్థులు, పక్కనే డాక్టర్ తిప్పారెడ్డి

తిరుపతిరూరల్, జూన్ 30(ఆంధ్రజ్యోతి): రేణిగుంట రోడ్డులోని డాక్టర్ అంబేడ్కర్ గ్లోబల్ లా ఇన్‌స్టిట్యూట్‌లో నిర్వహించిన మూట్ కోర్ట్ పోటీలలో(2024-25) ప్రతిభచాటిన విద్యార్థులకు సోమవారం ఛైర్మన్ డాక్టర్ ఆర్.తిప్పారెడ్డి నేతృత్వంలో బహుమతులు ప్రదానం చేశారు. ప్రథమ స్థానంలో నిలిచిన చిట్యాల సాయికృష్ణ కౌశిక్, మనీష్ చంద్రసాయి, యశ్వంత్‌కుమార్‌రెడ్డి టీంకు రూ.10వేల నగదు, ద్వితీయ స్థానం సాధించిన మానస, మౌనిక, విద్యశ్రీ జాస్మిన్‌కి రూ.5వేలు, ఉత్తమ స్పీకర్ విభాగంలో సాయికృష్ణ కౌశిక్‌కి రూ.5వేలు, ఉత్తమ మెమోరియల్‌కి రూ.5వేలు, ఉత్తమ పరిశోధక విభాగంలో దివ్యచందనకు రూ.5వేల నగదుతోపాటు ట్రోఫీ, బహుమతులు అందజేసి అభినందించారు. ప్రిన్సిపాల్ విజయకుమార్ బెహరా, అధ్యాపకులు జూలీ, రష్మీ, రేఖ, శుభమస్తు పాండా, స్వగతిక, వేదవాణి, మ్యాగ్లిన్ తదితరులు పాల్గొన్నారు.

శాస్త్రోక్తంగా కాలభైరవ హోమం



అలంకారంలో శ్వేత వారాహిదేవి

రామచంద్రాపురం, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): శక్తి పీఠంలో శ్వేత వారాహి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా సోమవారం కాలభైరవ హోమం శాస్త్రోక్తంగా నిర్వహించారు. మరకత శక్తికాళీ అమ్మవారితో పాటు శ్వేతవారాహిదేవికి తిరుమంజనం నిర్వహించి ప్రత్యేక అలంకరణ చేపట్టారు. సాయంత్రం అమ్మవారి ఊంజల్‌సేవ వైభవంగా నిర్వహించారు. అమ్మవారిని తిరుపతి 5వ జిల్లా కోర్టు న్యాయమూర్తి రామ్‌గోపాల్ దంపతులు దర్శించుకున్నారు. కుర్తాళం పీఠాధిపతి సిద్ధేశ్వరనంద భారతి, శక్తి పీఠాధీశ్వరి రమ్యానందభారతి భక్తులకు అనుగ్రహభాషణం చేశారు.

కార్మికుల సమస్యలను పరిష్కరించాలి



సమావేశంలో మాట్లాడుతున్న మధుసూదన్‌రావు

పాకాల, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): కార్మికుల సమస్యలను పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యుడు మధుసూదన్ రావు కోరారు. పాకాల పంచాయతీ కార్యాలయం వద్ద సోమవారం కార్మికుల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కార్మికులకు భద్రత కల్పించాలని, 8 గంటలే పనిచేయించాలని, వారి సంక్షేమం కోసం చర్యలు చేపట్టాలని కోరారు. సమస్యల పరిష్కారం కోసం ఈనెల 9వ తేదీ చేపట్టిన సమ్మెలో అందరూ పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ మురళి, నాయకులు గుణ, జనార్దన్, మహేశ్వరి పాల్గొన్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి



రామచంద్రాపురం, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): గుర్తు తెలియని వ్యక్తి ఆదివారం రాత్రి తిరుపతి రుయాస్పత్రిలో మృతి చెందాడు. ఆర్సీపురం పోలీసుల వివరాల మేరకు.. అనారోగ్యంతో బాధపడుతున్న 40ఏళ్ల వ్యక్తిని గుర్తు తెలియని వ్యక్తులు సి.రామాపురం విల్లాస్ వద్ద జూన్ 24న రోడ్డు పక్కన వదిలిపెట్టి వెళ్లారు. పోలీసులు గుర్తించి వైద్యం నిమిత్తం తిరుపతి రుయాకు తరలించారు. విచారించగా తన పేరు శ్రీనివాసులు అని మాత్రమే తెలిపినట్లు పోలీసులు చెప్పారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఆ వ్యక్తి వివరాలు తెలిసిన వారు చంద్రగిరి సీఐ 9000796760, వెంకటేష్, రైటర్, ఆర్‌సీపురం 7702469646, రాజశేఖర్, కానిస్టేబుల్ 7893030879కు సమాచారం ఇవ్వాలని కోరారు.

తహసీల్దారుకు సన్మానం

రామచంద్రాపురం, జూన్ 30(ఆంధ్రజ్యోతి): ఆర్‌సీపురం తహసీల్దారుగా వెంకటరమణ చేసిన సేవలు అమోఘమని ఎమ్మెల్యే పులివర్తి నాని అన్నారు. సోమవారం తహసీల్దారు ఉద్యోగ విరమణ సందర్భంగా సన్మాన సభ జరిగింది. పలువురు అధికారులు, ప్రజాప్రతినిధులు వెంకటరమణ సేవలను కొనియాడి ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో టీడీపీ మండలాధ్యక్షుడు తిరుమల రెడ్డి, కేశవులునాయుడు, జనార్దన్‌చౌదరి, చిన్నబాబు, నరసింహారెడ్డి, హరిప్రసాద్, ఎల్.సురేంద్రనాయుడు, మహేష్ పాల్గొన్నారు.

నాగరాజునాయుడు సేవలు అభినందనీయం



నాగరాజునాయుడు దంపతులను సన్మానిస్తున్న అధికారులు, నాయకులు

చంద్రగిరి, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): చంద్రగిరి ఆర్‌అండ్‌బీ కార్యాలయంలో పనిచేస్తున్న నాగరాజునాయుడు సేవలు అభినందనీయమని ఆర్‌అండ్‌బీ అధికారులు, నాయకులు కొనియాడారు. అటెండర్‌గా పనిచేసినా అభివృద్ధి కార్యక్రమాల్లో ముందుండే వారని, మండలంలో రహదారుల సమస్యలు ఉంటే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించే వరకు పోరాడే వ్యక్తి అని కొనియాడారు. ఉద్యోగ విరమణ సందర్భంగా నాగరాజునాయుడు దంపతులను ఘనంగా సన్మానించారు.

మహిళల ఆర్థికాభివృద్ధికి చేతివృత్తులే ఊతం



మహిళలకు శిక్షణ సామగ్రిని అందజేస్తున్న మోహన్

రామచంద్రాపురం, జూన్ 30(ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల్లో మహిళల ఆర్థికాభివృద్ధికి చేతివృత్తులు ఊతమిస్తాయని జనశిక్షణ్ సంస్థాన్ డైరెక్టర్ డాక్టర్ ఎం.మోహన్ అన్నారు. మండలంలోని సి.రామాపురం గ్రామంలో మహిళలకు రాస్-జన్ శిక్షణ సంస్థ ఆధ్వర్యంలో ఉచిత టైలరింగ్ శిక్షణా కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. మహిళలు ఆర్థికంగా ఎదగాలంటే చేతివృత్తులు నేర్చుకోవాలన్నారు. టైలరింగ్ శిక్షణ పూర్తి చేసుకున్న మహిళలకు రుణాలు ఇప్పిస్తామని తెలిపారు. అనంతరం హాజరైన మహిళలకు శిక్షణా సామగ్రిని అందజేశారు. ఈ కార్యక్రమంలో రాస్ కోఆర్డినేటర్ రామాంజనేయులు, జనశిక్షణ సంస్థ ప్రాజెక్టు ఆఫీసర్ సుధాకర్‌రెడ్డి, టైలరింగ్ టీచర్ సుమతి, రాస్ సిబ్బంది శిల్ప పాల్గొన్నారు.

అందరి సహకారంతో ఆదర్శ నియోజకవర్గానికి కృషి



సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే నాని

చంద్రగిరి, జూన్ 30(ఆంధ్రజ్యోతి): అందరి సహకారంతో నియోజకవర్గాన్ని ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతానని ఎమ్మెల్యే పులివర్తి నాని అన్నారు. సోమవారం చంద్రగిరి ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీపీ హేమేంద్రకుమార్‌రెడ్డి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే హాజరయ్యారు. ప్రధానమైన సమస్యలను అధికారులు, ప్రజాప్రతినిధులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ సరైన కారణాలు లేకుండా సమావేశానికి గైర్హాజరైతే శాఖాపరమైన చర్యలు ఉంటాయన్నారు. గత పాలకుల నిర్లక్ష్యం వల్ల వ్యవస్థ గాడి తప్పిందని, దాన్ని బాగు చేయడానికి అధికారులు సహకరించాలని కోరారు. చంద్రగిరి మండల పరిధిలోని రంగంపేట స్కూల్‌ను మోడల్ కేటగిరి కిందకు తీసుకొచ్చిన సీఎం చంద్రబాబు, ఐటీ శాఖ మంత్రి నారా లోకేశ్‌కు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. మండలంలోని శ్మశాన వాటికల్లో మౌళిక వసతుల కల్పనకు కృషి చేయాలని అధికారులను ఆదేశించారు. రానున్న వర్షాకాలాన్ని దృష్టిలో పెట్టుకుని చెరువులకు మరమ్మతులు చేయాలన్నారు. త్వరలోనే చంద్రగిరి టవర్ క్లాక్ వద్ద అన్న క్యాంటీన్ ప్రారంభిస్తామన్నారు. మండలంలో గంజాయి విచ్చలవిడిగా ఉన్నా ఒక్క కేసు కూడా నమోదు చేయని ఎక్సైజ్ శాఖ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. చంద్రగిరిలో నిర్మిస్తున్న గోవిందధామంకు సహకరించాలన్నారు. వెంకటంపేట వద్ద దీర్ఘకాలికంగా ఉన్న డ్రైనేజీ సమస్యను సర్పంచ్ వెంకటయ్య సమావేశంలో ప్రస్తావించగా వెంటనే ఎమ్మెల్యే వెంకటంపేటకు వెళ్లి పరిశీలించారు. పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో వెంకటరత్నం, తహసీల్దార్ శివరామసుబ్బయ్య పాల్గొన్నారు.

అభివృద్ధిని ప్రజల్లోకి తీసుకెళ్లండి: ఎమ్మెల్యే



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పులివర్తి నాని

తిరుచానూరు, జూన్ 30(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం చేసిన అభివృద్ధిని ప్రజల్లోకి తీసుకెళ్లాలని నాయకులకు, కార్యకర్తలకు చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని దిశానిర్దేశం చేశారు. తిరుపతి రూరల్‌లోని రఘునాథ్ రిసార్ట్స్‌లోని పార్టీ కార్యాలయంలో సోమవారం నియోజకవర్గంలోని ఆరు మండలాల అధ్యక్షులు, క్లస్టర్, బూత్ ఇన్‌చార్జులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ సంక్షేమ పథకాలను ప్రజల వద్దకు తీసుకెళ్లాల్సిన బాధ్యత ప్రతి కార్యకర్తపైనా ఉందన్నారు. నియోజకవర్గ వ్యాప్తంగా 934 అభివృద్ధి పనులను రూ.651 కోట్లతో చేపట్టినట్లు తెలిపారు. బుధవారం నుంచి ఇంటింటికీ మంచి ప్రభుత్వం కార్యక్రమం చేపట్టనున్నట్లు చెప్పారు. ప్రతి నాయకుడు, కార్యకర్త సహకరించి ఈ కార్యక్రమ విజయవంతానికి కృషి చేయాలన్నారు. గ్రామాల్లో దీర్ఘకాలికంగా ఉన్న పలు సమస్యలను పరిష్కరించినట్లు చెప్పారు. మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి సొంత పంచాయతీలో అండర్ డ్రైనేజీ కోసం సుమారు రూ.13కోట్లతో ప్రతిపాదనలు పంపామని, త్వరలోనే పూర్తిచేస్తామని తెలిపారు. మామిడి రైతులను ఆదుకునేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుందన్నారు. ఈ కార్యక్రమంలో తుడా ఛైర్మన్ డాలర్స్ దివాకర్‌రెడ్డి, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

తోటిమాన్యం కబ్జా చేసిన వారిపై చర్యలు తీసుకోండి

● తహసీల్దార్ కార్యాలయం వద్ద కుంట్రపాకం దళితుల నిరసన



తహసీల్దార్ కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న కుంట్రపాకం దళితులు

తిరుపతిరూరల్, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): తిరుపతి రూరల్ మండలం కుంట్రపాకం రెవెన్యూ లెక్కదాఖలా సర్వేనంబరు 268/1లో దళితుల ఆధీనంలో ఉన్న తోటిమాన్యం భూమిని కబ్జా చేసిన వారిపై చర్యలు చేపట్టాలని కోరుతూ సోమవారం రూరల్ తహసీల్దార్ కార్యాలయం వద్ద పలువురు దళితులు నిరసన తెలిపారు. వారు మాట్లాడుతూ గ్రామంలో 40 సెంట్ల భూమిని 1958లో 14మంది దళితులకు తోటిమాన్యంగా పేరడంగల్‌లో ఇచ్చారని, ఇందులో కొందరు తమ అవసరాల కోసం 20సెంట్ల భూమిని 1965-67మధ్యలో విక్రయించగా మిగిలిన 20సెంట్లభూమిలో సాగు చేసుకునేవారమన్నారు. కాలక్రమంలో నీటి ఎద్దడి కారణంగా వ్యవసాయం సాగుచేయలేని పరిస్థితిలో దాన్ని పశువులపాక, పేడదిబ్బలకు వినియోగించుకుంటున్నా మని తెలిపారు. ఈ క్రమంలో శ్రీకర హోమ్‌డెవలపర్స్ పేరిట మేనేజింగ్ పార్ట్నర్లు మిట్టపాలెం శంకర్‌రెడ్డి, మిట్టపాలెం శ్రీనివాసులురెడ్డి, మిట్టపాలెం నాగమణిరెడ్డి(టీడీపీనేతలు) సర్వే నంబర్లు 284, 287, 288లతోపాటు వాటి చుట్టుపక్కలున్న సర్వే నంబర్లలో దాదాపు 6 ఎకరాలలో వెంచర్ వేశారని, దీనికి ప్రధాన దారికోసం తోటిమాన్యం భూమిని తప్పుడు రికార్డు సృష్టించి ఆక్రమించారని ఆరోపించారు. తిరుచానూరు పోలీసులను అనుకూలంగా చేసుకుని వెంచర్‌లోకి రోడ్డు నిర్మాణ పనులు చేపట్టారన్నారు. దీన్ని అడ్డుకున్న బాధితుల పట్ల తిరుచానూరు సీఐ అనుచితంగా ప్రవర్తించి భయభ్రాంతులకు గురిచేశారని ఆరోపించారు. దీనిపై చంద్రగిరి డీఎస్పీ, లా అండ్ ఆర్డర్ ఏఎస్పీకి ఫిర్యాదు చేశామని, వారి సూచనలు కూడా సీఐ పట్టించుకోకుండా ఆక్రమణదారులకు సహరిస్తున్నారని ఆరోపించారు. దీనిపై ఎస్పీ కార్యాలయంలో వినతి సమర్పించామని, ఏఎస్పీ చొరవ తీసుకుని న్యాయం చేస్తామని హామీ ఇచ్చారన్నారు. ఈ భూమిని సర్వేచేసి ఆక్రమణదారులపై కఠిన చర్యలు చేపట్టాలని తహసీల్దార్ రామాంజులనాయక్‌కి వినతి సమర్పించారు.

ఇద్దరు 'ఎర్ర' స్మగ్లర్ల అరెస్టు

● మరో ముగ్గురు పరారీ



తలకోన అటవీ ప్రాంతంలో పట్టుబడిన ఎర్రచందనం స్మగ్లర్లు

ఎర్రావారిపాలెం, జూన్ 30(ఆంధ్రజ్యోతి): తలకోన సెంట్రల్ బీట్.. చిట్టిదిన్నె అటవీ ప్రాంతంలో సోమవారం ఇద్దరు ఎర్రచందనం స్మగ్లర్లను అరెస్టు చేసి ఐదు దుంగలను స్వాధీనం చేసుకున్నట్లు భాకరాపేట రెంజ్ ఆఫీసర్ వెంకటరమణ తెలిపారు. వీరికి వచ్చిన సమాచారంతో వేకువజామున కూంబింగ్ చేపట్టారు. చిట్టిదిన్నె ప్రాంతంలో స్మగ్లర్లు తారసపడగా దాడి చేశారు. ఎర్రావారిపాలెం మండలం నెరబైలు పంచాయతీ పులిగోను పల్లెకు చెందిన దేసూరి దేశయ్య, నరేషను పట్టుకున్నారు. అదే పల్లెకు చెందిన కానాల రాంమోహన్‌రెడ్డి, బోసి సోమశేఖర్ రెడ్డి, కూరపర్తి వారిపల్లెకు చెందిన నెరుగుండ్ల సాయి పారిపోయినట్టు వెంకటరమణ తెలిపారు. పట్టుబడిన దుంగల విలువ రూ.పది లక్షలు ఉంటుందన్నారు. ఈ దాడిలో ఫారెస్టు బీట్ ఆఫీసర్ చాంద్ బాషా, సెక్షన్ ఆఫీసర్ సల్లా వుద్దీన్, అడ్డగుట్ట బేస్ క్యాంప్ వాచర్లు పాల్గొన్నారు.

హత్య కేసులో నిందితుడికి జీవిత ఖైదు

తిరుపతి(నేరవిభాగం), జూన్ 30(ఆంధ్రజ్యోతి): తిరుపతిలో మూడేళ్ల క్రితం జరిగిన హత్య కేసులో నిందితుడు సోమశేఖర్‌కు జీవిత ఖైదుతో పాటు రూ.పది వేల జరిమానా విధిస్తూ తిరుపతి ఐదవ జిల్లా న్యాయమూర్తి జి. రామ్‌గోపాల్ సోమవారం తీర్పు చెప్పారు. వెస్ట్ సీఐ మురళీమోహన్ కథనం మేరకు.. కటికరంగడ వీధిలో కాపురమున్న గుంటూరు అఖిల్‌కుమార్, సోమశేఖర్ మధ్య పాత కక్షలు ఉన్నాయి. ఈ క్రమంలో వారిద్దరి మధ్య మాటా మాటా పెరిగింది. ఈ గొడవలో అఖిల్‌కుమార్ హత్యకు గురయ్యారు. 2022 డిసెంబరు 20న సోమశేఖర్‌ను అప్పటి సీఐ శివప్రసాద్ అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. మూడేళ్ళుగా కేసు విచారణ సాగింది. ఇరు వర్గాల వాదనలు విన్న న్యాయమూర్తి నిందితుడికి జీవిత ఖైదుతో పాటు రూ.పది వేల జరిమానా విధిస్తూ తీర్పు చెప్పారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్ బాలకృష్ణమ నాయుడు వాదనలు వినిపించారు.

ఇద్దరు 'ఎర్ర' స్మగ్లర్లకు ఐదేళ్ల జైలు

● రూ.ఆరు లక్షల చొప్పున జరిమానా

తిరుపతి(నేరవిభాగం), జూన్ 30(ఆంధ్రజ్యోతి): ఎర్రచందనం అక్రమంగా తరలిస్తూ టాస్క్‌ఫోర్స్ పోలీసులకు పట్టుబడిన ఇద్దరు స్మగ్లర్లకు ఐదేళ్ల జైలు శిక్షతో పాటు ఒక్కొక్కరికి రూ.ఆరు లక్షలు జరిమానా విధిస్తూ సోమవారం రెడ్ శ్యాండిల్ కోర్టు జిల్లా అదనపు న్యాయమూర్తి నరసింహమూర్తి తీర్పు చెప్పారు. తిరుపతి, చిత్తూరు జిల్లాలకు చెందిన దామోదరం, హరిప్రసాద్ చంద్రగిరి మండలం పాండురంగవారిపల్లి వద్ద ఎర్రచందనం దుంగలను తరలించడానికి ప్రయత్నించారు. దీంతో తొమ్మిది సంవత్సరాల క్రితం వారిని అరెస్టు చేశారు. టాస్క్‌ఫోర్సు ఎస్పీ శ్రీనివాస్ ఆధ్వర్యంలో నిందితులకు కఠినంగా శిక్ష పడేలా ప్రణాళికలు రూపొందించారు. సాక్ష్యాధారాలతో సహా హాజరు పరచడంతో వారికి ఐదేళ్ళ పాటు జైలు శిక్షతో పాటు ఒక్కొక్కరికి రూ ఆరు లక్షలు జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పు చెప్పారు.

బిల్లు కలెక్టర్ సస్పెన్షన్

తిరుపతి(కలెక్టరేట్), జూన్ 30 (ఆంధ్రజ్యోతి): తిరుచానూరు పంచాయతీ బిల్లు కలెక్టర్ రమేష్‌ను సస్పెండ్ చేస్తూ డీపీవో సుశీలాదేవి సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. వసూలు చేసిన ఇంటి పన్ను, నీటి పన్నుకు సంబంధించి రూ.22.73లక్షలు దుర్వినియోగం చేశారని పేర్కొన్నారు. ఈ మొత్తాన్ని మూడు రోజుల్లో పంచాయతీకి చెల్లించాలని, లేదంటే క్రిమినల్ కేసులు నమోదు చేయాలని ఉత్తర్వులో పేర్కొన్నారు.

తిరుమలలో 'భోగ్ బండారు'



బంజారీలతో టీటీడీ ఛైర్మన్

తిరుమల, జూన్ 30(ఆంధ్రజ్యోతి): శ్రీవారి పరమభక్తుడైన హథీరాం బావాజీ జన్మదినం సందర్భంగా తిరుమలలో సోమవారం 'భోగ్ బండారు' జరిగింది. వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన బంజారా తెగకు చెందిన భక్తులు 'భోగ్ బండారు' పేరుతో పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి టీటీడీ ఛైర్మన్ బీఆర్ నాయుడు హాజరు కాగా.. బంజారా తెగకు హథీరాం బావాజీకి ఉన్న అవినాభావ సంబంధాన్ని వారు వివరించారు. బంజారాల మహంత్ రమేష్‌గురు మహరాజ్ మాట్లాడుతూ.. బంజారాల కులగురువు హథీరాం బావాజీ 596వ జన్మదిన వేడుకలను హథీరాం మఠంలో వైభవంగా నిర్వహించామన్నారు. ఈ కార్యక్రమానికి ఏడు రాష్ట్రాల నుంచి బంజారీలు పాల్గొన్నారన్నారు అనంతరం వారు తిరుమలలోని వేణుగోపాల స్వామి ఆలయాన్ని సందర్శించారు.

వృత్తినైపుణ్య శ్రీవారి సేవకులకు ప్రత్యేక అప్లికేషన్

● టీటీడీ అదనపు ఈవో వెంకయ్య చౌదరి



తిరుమల, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): వృత్తి నైపుణ్య శ్రీవారి సేవకుల కోసం నెల రోజుల్లోపు ప్రత్యేక అప్లికేషన్ రూపొందిస్తామని టీటీడీ అదనపు ఈవో వెంకయ్య చౌదరి తెలిపారు. తిరుమలలోని అన్నమయ్య భవనంలో ఆయన సోమవారం వృత్తి నిపుణుల (ప్రొఫెషనల్) శ్రీవారి సేవపై జేఈవో వీరబ్రహ్మంతో కలిసి సమీక్షించారు. సీఎం చంద్రబాబు ఆదేశాల మేరకు ప్రపంచవ్యాప్తంగా ఉన్న వృత్తి నిపుణులను శ్రీవారి సేవ ద్వారా టీటీడీలో ముఖ్యమైన 10 విభాగాల్లో ఉపయోగించుకునేందుకు కార్యాచరణ రూపొందించాలని ఆదేశించారు. సాంకేతిక విభాగాల్లోనూ వారి సేవలను వినియోగించుకోవాలని నిర్ణయించామన్నారు. ప్రతి విభాగంలో అవసరాలన్ని బట్టి శ్రీవారి సేవ ద్వారా వృత్తి నైపుణ్య సేవకుల సేవలను వినియోగించుకునేలా చర్యలు తీసుకోవాలన్నారు. ముందుగా ప్రయోగాత్మకంగా ఈ విధానాన్ని ప్రవేశపెట్టిన తర్వాత పూర్తిస్థాయిలో అమలుచేయాలన్నారు. త్వరలోనే దీనిపై నిర్దిష్ట విధానాన్ని రూపొందించి సుస్థిర వ్యవస్థగా మార్చేందుకు కృషి చేయాలన్నారు. ఈ సమీక్షలో స్విమ్స్ డైరెక్టర్ ఆర్వీ కుమార్, బర్డ్ డైరెక్టర్ జగదీష్, సీఈ సత్యనారాయణ, ఐటీ జీఎం శేషారెడ్డి, సీఎంవో నర్మద, డిప్యూటీఈవోలు పాల్గొన్నారు.

పరిమితికి మించి విద్యార్థుల తరలింపు

● ఐదు ఆటోలపై కేసు.. సీజ్



ఆటోలను తనిఖీ చేస్తున్న ఎంవీఐ అతికానాజ్

తిరుపతి(జీవకోన), జూన్ 30(ఆంధ్రజ్యోతి): పరిమితికి మించి విద్యార్థులను తరలిస్తున్న ఐదు ఆటోలపై సోమవారం కేసులు నమోదు చేశారు. ఎంఆర్‌పల్లి కూడలి వద్ద మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ అతికానాజ్ తనిఖీలు చేపట్టారు. వాహన సామర్థ్య ధ్రువీకరణ పత్రం లేకపోవడం, పరిమితికి మించిన విద్యార్థులతో వెళ్తుండటంతో ఐదు ఆటోలపై కేసులు పెట్టి, స్వాధీనం చేసుకున్నారు. ఆటోలలో పరిమితికి మించి విద్యార్థులను తరలించవద్దని ఎంవీఐలు శ్రీనివాసరావు, మోహన్‌కుమార్ అలిపిరి వద్ద ఆటో డ్రైవర్లకు కౌన్సెలింగ్ ఇచ్చారు.

లారీలో నుంచి పడి క్లీనర్ మృతి



నాగరాజు మృతదేహం

కోవూరు, జూన్ 30(ఆంధ్రజ్యోతి): కోవూరుకు సమీపంలోని నందలగుంట వద్ద కోల్‌కత్తా-చెన్నై జాతీయ రహదారిపై వేగంగా వెళ్తున్న లారీలో నుంచి కిందపడి క్లీనర్ మృతి చెందిన ఘటన సోమవారం వేకువజామున జరిగింది. పోలీసుల కథనం ప్రకారం... తిరుపతి పట్టణంలోని లీలామహల్ సెంటర్ ప్రాంతానికి చెందిన నాగరాజు (65) చాలాకాలం నుంచి లారీ క్లీనర్‌గా జీవనం సాగిస్తున్నారు. పది రోజుల కిందట లారీలో తిరుపతి నుంచి రాయపూర్‌కు వెళ్లాడు. తిరిగి రాయపూర్ నుంచి ఐరన్‌ఓర్ లోడుతో చెన్నైకి వెళుతుండగా నిద్ర మత్తులో లారీలో నుంచి ప్రమాదవశాత్తు కింద పడ్డాడు. వేగంగా వెళ్తున్న లారీ నుంచి పడటంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. ఎస్ఐ రంగనాథ్‌గౌడ్ కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

తిరుపతి

ఓఆర్ఐకు రండి

● టీటీడీ చైర్మన్‌కు ఓఆర్ఐ డైరెక్టర్ ఆహ్వానం



బీఆర్ నాయుడికి పుస్తకాలను అందజేస్తున్న వెంకటేశ్వర్లు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), జూన్ 30 (ఆంధ్రజ్యోతి): ఎస్వీయూ ఓఆర్ఐ విభాగాన్ని సందర్శించాలని టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడిని ఓఆర్ఐ డైరెక్టర్ ప్రొఫెసర్ పీసీ వెంకటేశ్వర్లు ఆహ్వానించారు. బీఆర్ నాయుడిని సోమవారం ఆయన కలిశారు. ఓఆర్ఐలోని అరుదైన తాళపత్రాల గురించి తెలియజేశారు. 16 వేల తాళపత్ర గ్రంథాలు ఉన్నాయని చెప్పారు. దక్షిణ భారత దేశంలో ఎంతో ప్రాచుర్యం కల్గిన ఓఆర్ఐని గతంలో టీటీడీ నిర్వహించేదని అన్నారు. తాళపత్రాలను తిలకించడానికి ఓఆర్ఐకు రావాలని కోరారు. ఈ నెలలో తప్పకుండా వస్తానని టీటీడీ చైర్మన్ తెలిపారు. యూనివర్సిటీకి వార్షిక నిధులను టీటీడీ అందిస్తోందన్నారు. ఓఆర్ఐ ఇటీవల ప్రచురించిన వాల్మీకి చరిత్ర, పెద తిరుమలాచార్యుల భగవద్గీత పుస్తకాలను అందజేశారు.

మృదంగం సుధాకర్‌కు సన్మానం



మృదంగం సుధాకర్ దంపతులను సన్మానిస్తున్న సదాశివం

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), జూన్ 30 (ఆంధ్రజ్యోతి): ఎస్వీ మ్యూజిక్ కాలేజీలో మృదంగం సుధాకర్ ఉద్యోగ విరమణ పొందారు. కాలేజీ అధ్యాపకులు, విద్యార్థులు సోమవారం సుధాకర్ దంపతులను ఘనంగా సన్మానించారు. నాయీ బ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ రుద్రకోటి సదాశివం మాట్లాడుతూ సుధాకర్ ఎస్వీ మ్యూజిక్ కాలేజీలో మృదంగం అధ్యాపకుడిగా, మృదంగ విభాగాధిపతిగా, కాలేజీ ప్రిన్సిపాల్‌గా సుదీర్ఘకాలం సేవలందించారని కొనియాడారు. దేశ, విదేశాల్లో ఎన్నో మృదంగం కచేరీలు నిర్వహించి ఎంతో మంది అభిమానులను సంపాదించుకున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఉమముద్దుబాల, రిటైర్డు స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ ఈవో మునిరత్నంరెడ్డి, నాదస్వర, డోలు విద్వాంసులు సత్యనారాయణ, మునిరత్నం, రామనాథన్, రావిపాటి సత్యనారాయణ, కృష్ణారావు, గోవిందశెట్టి, రామచంద్రయ్య, రఘునాథ్, కేసన్న, నాగరాజు, నారాయణ, వేంకటేశ్వర భాగవతార్, కృష్ణమూర్తి పాల్గొన్నారు.

జీవన నైపుణ్యాలపై వర్క్‌షాప్



వర్క్‌షాప్‌నకు హాజరైన ప్రతినిధులు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), జూన్ 30 (ఆంధ్రజ్యోతి): పద్మావతి మహిళా యూనివర్సిటీలో జీవన నైపుణ్యాలు అంశంపై వర్క్‌షాప్ చేపట్టారు. రెండు రోజుల పాటు సాగే ఈ వర్క్‌షాప్ సావేరీ హాల్లో సోమవారం ప్రారంభమైంది. రిజిస్ట్రార్ ఎన్.రజని మాట్లాడుతూ జీవితంలో ఎదురయ్యే సవాళ్లను ఆత్మ స్థైర్యంతో ఎదుర్కోవాలన్నారు. సమస్యలకు భయపడే పరిస్థితి రాకుండా చూసుకోవాలన్నారు. వర్సిటీ పీఎం-ఉష కో-ఆర్డినేటర్ సి.వాణి మాట్లాడుతూ విద్యార్థులు జీవన నైపుణ్యాలు పెంపొందించుకోవాలని కోరారు. జీవన నైపుణ్యాల ప్రాముఖ్యతను గుర్తించి ప్రభుత్వం పాఠ్యాంశాల్లోకి లైఫ్ స్కిల్స్‌ను ప్రవేశపెట్టిందన్నారు. బెంగళూరులోని నిమ్‌హాన్స్ సీనియర్ కన్సల్టెంట్ ప్రొఫెసర్ శేఖర్ మాట్లాడుతూ మనిషి జీవన మనుగడకు జీవన నైపుణ్యాలు తప్పనిసరిగా అవసరమన్నారు. అననుకూల పరిస్థితుల్లో ఉన్నత స్థానాలకు ఎదిగిన వారి జీవితాలను ఈ తరం స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. ఈ వర్క్‌షాప్ రిసోర్స్ పర్సన్‌గా ఎం.సంజీవ్‌కుమార్ వ్యవహరించారు. అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఉద్యోగ విరమణ పోలీసులకు ఆత్మీయ వీడ్కోలు



పదవీ విరమణ పొందిన అధికారులను సన్మానిస్తున్న అదనపు ఎస్పీ

తిరుపతి(నేరవిభాగం), జూన్ 30(ఆంధ్రజ్యోతి): ఉద్యోగ విరమణ పొందిన పోలీసు అధికారులు, సిబ్బందికి సోమవారం జిల్లా పోలీసు శాఖ నేతృత్వంలో ఆత్మీయ వీడ్కోలు పలికారు. ముఖ్య అతిథిగా వచ్చిన అదనపు ఎస్పీ రవిమనోహరాచారి మాట్లాడుతూ శేష జీవితాన్ని ఆనందంగా, ఆరోగ్యంగా గడపాలని ఆకాంక్షించారు. అనంతరం ఉద్యోగ విరమణ పొందిన ఎస్ఐలు, ఏఎస్ఐలు, హెడ్ కానిస్టేబుళ్లను శాలువాలతో సత్కరించారు. కార్యక్రమంలో ఆర్ఐ రమణారెడ్డి, ఎంటీవో రాజశేఖర్, పోలీసు అధికారుల సంఘం అధ్యక్షుడు సోమశేఖర్ రెడ్డి పాల్గొన్నారు.

క్యూఆర్ కోడ్ పోస్టర్ల ఆవిష్కరణ



తిరుపతి(జీవకోన), జూన్ 30(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం ఎన్నికల సమయంలో విడుదల చేసిన మేనిఫెస్టోను గుర్తు చేస్తూ వైసీపీ ఆధ్వర్యంలో సోమవారం పోస్టర్లను ఆవిష్కరించారు. పార్టీ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు భూమన కరుణాకరరెడ్డి నివాసం వద్ద నియోజకవర్గ సమన్వయకర్త అభినయ్ రెడ్డి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం చేపట్టారు. కరుణాకరరెడ్డి మాట్లాడుతూ చంద్రబాబు ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా ప్రజలను మోసం చేశాడని విమర్శించారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు ఇంటింటికీ వెళ్లి ఈ విషయాన్ని ప్రజలకు తెలియజేయాలని కోరారు. మేయర్ డాక్టర్ శిరీష మాట్లాడారు. టౌన్ బ్యాంకు చైర్మన్ కేతం జయచంద్రారెడ్డి, నగర అధ్యక్షుడు మల్లం రవిచంద్రారెడ్డి, పార్టీ కార్పొరేటర్లు, నాయకులు పాల్గొన్నారు.

విద్యుత్ శాఖలో అధికారుల సేవలు అమూల్యం



అధికారులను సన్మానిస్తున్న ఉన్నతాధికారులు

తిరుపతి(ఆటోనగర్), జూన్ 30 (ఆంధ్రజ్యోతి): ఎస్పీడీసీఎల్‌లో డైరెక్టర్లు పి.అయూబ్‌ఖాన్, కె.గురవయ్య సేవలు అమూల్యమని పేర్కొన్నారు. తిరుపతి సదరన్ డిస్కం కార్యాలయంలో సోమవారం జీఎం ఎస్ఎల్ అంజనీకుమార్, ఎస్ఈ కె.శ్రీనివాసరావు, ఈఈ మహమ్మద్ అయూబ్‌ఖాన్, పీవో గజేంద్రకుమార్, జేఏవో వీకే.దశరథరామ్ ఉద్యోగ విరమణ చేశారు. వారిని ఘనంగా సన్మానించారు. సంస్థకు వారు చేసిన సేవలను గుర్తు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో సీజీఎం జె.రమణాదేవి, కేఆర్ఎస్ ధర్మజ్ఞాని, సీహెచ్ జానకిరామ్, ఆదిశేషయ్య, శోభావాలంటీన, కె.రామ్మోహన్‌రావు, చీఫ్ విజిలెన్స్ అధికారి కె.జనార్దన్ నాయుడు, సీజీఆర్ఎఫ్ చైర్మన్ వి.శ్రీనివాస అంజనేయమూర్తి, జీఎంలు మురళి కుమార్, వెంకటరాజు, ప్రసాద్, సురేంద్రరావు, నరేంద్రనాథ్ పాల్గొన్నారు.

ఏపీ క్వాంటమ్ లీప్‌లో భాగస్వామ్యం

- వర్క్‌షాప్‌కు ఎస్వీయూ, పద్మావతి వర్సిటీ వీసీల హాజరు



పాల్గొన్న వీసీలు అప్పారావు, ఉమ

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), జూన్ 30 (ఆంధ్రజ్యోతి): అమరావతిని క్వాంటమ్ టెక్నాలజీకి కేంద్రంగా నిలపాలని సీఎం చంద్రబాబు యోచిస్తున్నారు. ఇందుకు సంబంధించి విజయవాడలోని నోవాటెల్‌లో సోమవారం వర్క్‌షాప్ చేపట్టారు. ఈ వర్క్‌షాప్‌నకు తిరుపతిలోని ఎస్వీ యూనివర్సిటీ వీసీ ప్రొఫెసర్ అప్పారావు, పద్మావతి మహిళా యూనివర్సిటీ వీసీ ఉమ హాజరయ్యారు.

పతక విజేతకు సన్మానం



గణేష్ మణిరత్నంను సన్మానిస్తున్న కలెక్టర్ వెంకటేశ్వర్

తిరుపతి(కలెక్టరేట్), జూన్ 30(ఆంధ్రజ్యోతి): సింగపూర్‌లో జూన్ 15 నుంచి 20వ తేదీ వరకు జరిగిన ఆసియా కప్ స్టేజీ-2 ఆర్చరీ పోటీల్లో నాయుడుపేటకు చెందిన తిరుమూరు గణేష్ మణిరత్నం రజక పతకం సాధించాడు. సోమవారం కలెక్టరేట్‌లో కలెక్టర్ వెంకటేశ్వర్ ఆయన్ను సన్మానించారు. మరిన్ని విజయాలు సాధించి జిల్లాకు, రాష్ట్రానికి, దేశానికి మంచిపేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. జేసీ శుభం బన్సల్ పాల్గొన్నారు.

సుందరీకరణ పనులను వేగవంతం చేయాలి

తిరుపతి(కలెక్టరేట్), జూన్ 30(ఆంధ్రజ్యోతి): నగరంలోని పలు ట్యాంకులు(కుంటలు) సుందరీకరణ పనులను వేగవంతంగా పూర్తిచేయాలని కలెక్టర్ వెంకటేశ్వర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో సోమవారం జేసీ శుభం బన్సల్‌తో కలిసి ఆయన అధికారులతో సమీక్షించారు. కలెక్టర్ మాట్లాడుతూ దామినేడు, పేరూరు, అవిలాల రామక్క చెరువు, తూకివాకం, వెంకటాపురం, వెలమండ్యం వినాయకసాగర్, పాన్ చెరువు, గొల్లవానిగుంట, కొరమేనుగుంట చెరువుల అభివృద్ధికి చర్యలు తీసుకోవాలన్నారు. స్మార్ట్‌సిటీలో భాగంగా వినాయకసాగర్, గొల్లవానిగుంట ఇప్పటికే అభివృద్ధి చేశారని, మిగిలిన వాటి అభివృద్ధికి ప్రణాళికలు సిద్ధం చేయాలని తెలిపారు. ట్రైనీ కలెక్టర్ సందీప్ రఘువాన్షి, డ్వామా పీడీ శ్రీనివాసప్రసాద్, ఇరిగేషన్ ఎస్ఈ వెంకటప్రసాద్, తుడా ఎస్ఈ కృష్ణారెడ్డి, ఈఈ రవీంద్రనాథ్, డీపీవో సుశీలాదేవి పాల్గొన్నారు.

తిరుమలనగర్ నుంచి 'ఇంటింటికీ మంచి ప్రభుత్వం'

తిరుపతి అర్బన్, జూన్ 30(ఆంధ్రజ్యోతి): ఇంటింటికీ మంచి ప్రభుత్వం కార్యక్రమం బుధవారం తిరుమలనగర్ నుంచిప్రారంభం కానుంది. ఎమ్మెల్యే పులివర్తి నాని ఆ రోజు ఉదయం మంగళం క్వార్టర్స్‌లోని సాయిబాబా మందిరంలో పూజలు నిర్వహిస్తారు. అక్కడి నుంచి తిరుమలనగర్‌కు చేరుకుని ఏడాదిలో చేపట్టిన అభివృద్ధి పనులను ఇంటింటికీ వెళ్లి వివరిస్తారు. అదే సమయంలో ప్రజల సమస్యలను అడిగి తెలుసుకోనున్నారు. టీడీపీ తిరుమలనగర్ అధ్యక్షుడు గోవిందరాజు ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేస్తున్నారు.

పోలీసు పీజీఆర్ఎస్‌కు 88 వినతులు



వినతులు స్వీకరిస్తున్న అదనపు ఎస్పీ నాగభూషణరావు

తిరుపతి(నేరవిభాగం), జూన్ 30(ఆంధ్రజ్యోతి): ఎస్పీ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికకు 88 వినతులు వచ్చాయి. ప్రధానంగా భూమి, ఆర్థికపరమైన సమస్యలు, భార్యాభర్తల గలాటాలకు సంబంధించి వచ్చాయి. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీలు రవిమనోహరాచారి, నాగభూషణరావు, డీఎస్పీలు, సీఐలు పాల్గొన్నారు.

డాక్టరేట్ ప్రదానం



లలితా శివజ్యోతి

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), జూన్ 30 (ఆంధ్రజ్యోతి): పద్మావతి మహిళా యూనివర్సిటీ సంగీత, నృత్య విభాగ పరిశోధకులు వి.లలిత శివజ్యోతి డాక్టరేట్ పొందారు. క్రిటికల్ స్టడీ ఆఫ్ ద కాంపోజిషన్ ఆఫ్ యోగి నారాయణస్వామి అంశంపై విశ్రాంతాచార్య ద్వారం వి.జె.లక్ష్మి పర్యవేక్షణలో పరిశోధన పూర్తి చేసినట్లు పీఆర్వో శ్రీరజని తెలిపారు.

రేపు గోవిందరాజస్వామి ఆలయంలో పుష్పయాగం

తిరుపతి అర్బన్, జూన్ 30(ఆంధ్రజ్యోతి): గోవిందరాజస్వామి ఆలయంలో బుధవారం పుష్పయాగం నిర్వహించనున్నారు. ఇందులో భాగంగా మంగళవారం సాయంత్రం అంకురార్పణ క్రతువును శాస్త్రోక్తంగా చేపడతారు. గత నెల 2నుంచి 10వ తేదీ వరకు గోవిందరాజస్వామి బ్రహ్మోత్సవాలు జరిగిన విషయం తెలిసిందే. ఉత్సవాల్లోగానీ, నిత్యకైంకర్యాల్లోగానీ, అర్చక పరిచారకులు, అధికార, అనధికారులు, భక్తుల వల్లగానీ తెలిసో తెలియక ఏవైనా లోపాలు జరిగి ఉంటే వాటికి ప్రాయశ్చిత్తంగా పుష్పయాగం నిర్వహించడం ఆనవాయితీ. ఇందులో భాగంగా ఆ రోజు ఉదయం 9.30-11.30గంటల వరకు శ్రీదేవి భూదేవి సమేత గోవిందరాజస్వామికి స్నపన తిరుమంజనం, మధ్యాహ్నం ఒంటిగంట నుంచి సాయంత్రం 4గంటల వరకు పుష్పయాగం నిర్వహించనున్నారు. సాయంత్రం 6-7గంటల మధ్య ఉత్సవర్లను మాడవీధుల్లో ఊరేగిస్తారు. పాల్గొనదలచిన భక్తులు(ఇద్దరికి) రూ.516 చెల్లించాలి. పుష్పయాగాన్ని పురస్కరించుకుని మంగళ, బుధవారాల్లో ఆలయంలో ఊంజల్ సేవను రద్దు చేశారు.

నేడు ఉచిత వైద్య శిబిరం

తిరుపతి(వైద్యం), జూన్ 30(ఆంధ్రజ్యోతి): జాతీయ వైద్యుల దినోత్సవం సందర్భంగా శ్రీరమాదేవి ఆస్పత్రిలో మంగళవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు ఆస్పత్రి అధినేత డాక్టర్ డీబీ శశిధర్‌రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉచిత కన్సల్టేషన్, ఉచిత ఆపరేషన్లు, అన్ని రకాల వ్యాధులకు ఉచిత వైద్యం, అవసరమైన మందులను అందిస్తామని తెలిపారు.

వ్యభిచార గృహంపై పోలీసుల దాడులు

● నిర్వాహకురాలితోపాటు ఇద్దరి అరెస్టు

తిరుపతి(నేరవిభాగం), జూన్ 30(ఆంధ్రజ్యోతి): వ్యభిచార గృహంపై పోలీసులు సోమవారం దాడులు చేశారు. నిర్వాహకులితోపాటు మరొకరిని అరెస్టు చేశారు. అలిపిరి సీఐ రాంకిషోర్ వివరాల మేరకు.. ఉపాధ్యాయనగర్‌లోని మహీధర్ నివాస్ అపార్టుమెంటులో నివాసముంటున్న ఒక మహిళ వ్యభిచార నిర్వహిస్తోంది. అలిపిరి సీఐకి అందిన సమాచారం మేరకు పోలీసులు వెళ్లి తనిఖీలు చేశారు. నిర్వాహకురాలితో పాటు విటుడు జయచంద్రను అరెస్టు చేశారు. రూ.2వేలు నగదు, కాండోమ్‌లు, రెండు మొబైల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు.

తెలుగు కథల్లో నిక్షిప్తమైన గ్రామీణ జీవితం

● రచయిత ఆర్సీ కృష్ణస్వామి రాజు



రచయిత కృష్ణస్వామిరాజును సన్మానిస్తున్న మధుజ్యోతి, సుభాషిణి

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), జూన్ 30 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ జీవితం తెలుగు కథల్లో నిక్షిప్తమై ఉందని ప్రముఖ రచయిత ఆర్సీ కృష్ణస్వామిరాజు అభిప్రాయపడ్డారు. పద్మావతి మహిళా విశ్వవిద్యాలయ తెలుగు విభాగంలో 'తెలుగు కథ - గ్రామీణ జీవితం' అంశంపై సాహితీ సమితి ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. తెలుగులో ప్రసిద్ధ కథా రచయితల నుంచి వర్తమాన రచయితల దాకా అనేక మంది గ్రామీణ జీవితాన్ని విస్తృతంగా కథలుగా మలిచారని తెలిపారు. పల్లెల్లోని మంచిచెడులు కథల్లో కనిపిస్తాయన్నారు. ప్రత్యేకించి గ్రామీణ జీవితంలో గల సామాజికార్థిక అంశాలు కథల నిండా పరుచుకుని ఉన్నాయని చెప్పారు. దీనివల్ల గ్రామీణ జీవితం చైతన్యవంతమయ్యేందుకూ, మెరుగు పడేందుకూ కథా రచయితలు దోహదం చేశారని అభిప్రాయపడ్డారు. తాను రాసిన గాండ్లమిట్ట, కోడిగుడ్డు, అమ్మ సినిమాకు వెళ్లాలంటోంది, గోల్కొండను చూసి వద్దాం రండి వంటి కథల్లో జీవిత వాస్తవికత ఉందని అన్నారు. తెలుగు విభాగ అధ్యక్షురాలు ఆచార్య కొలకలూరి మధుజ్యోతి మాట్లాడుతూ తమ జీవితాన్నీ తమ చుట్టూ ఉన్న జీవితాన్ని ఎంతో మంది రచయితలుగా కథలుగా రూపొందించారని తెలిపారు. సాహితీ సమితి సమన్వయకర్త డాక్టర్ వై. సుభాషిణి మాట్లాడుతూ సమాజం, సాహిత్యం పట్ల తగిన అవగాహన, బాధ్యత పెంపొందించే లక్ష్యంతో ఇటువంటి కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. అనంతరం రచయిత కృష్ణస్వామిరాజును శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో పలువురు అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పొంగుతున్న మురుగు

● మధురానగర్‌లో ఆగిపోయిన డ్రైనేజీలు



పొంగిపొర్లుతున్న మ్యాన్ హోల్

తిరుపతి (నేరవిభాగం), జూన్ 30 (ఆంధ్రజ్యోతి): నగరంలోని మధురానగర్‌లో డ్రైనేజీల్లో చెత్త పేరుకుపోయి పొంగి ప్రవహిస్తున్నాయి. ఇంజనీరింగ్ అధికారులకు ముందుచూపు కొరవడడంతో నిర్మాణ లోపాలు ఉన్నాయి. దానికి తోడు చెత్త పేరుకుపోతుండడంతో మురుగు నీరు పొంగి రోడ్లపై ప్రవహిస్తోంది. రైల్వేకాలనీలోని సీపీఎం ఆఫీసు వద్ద, తుడా రిటైర్డు ప్రణాళికా విభాగం పీవో ఇంటి వద్ద రోడ్లపై నీరు ప్రవహిస్తుండడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. దోమలు వ్యాప్తి చెంది కంటిమీద కునుకులేకుండా చేస్తున్నాయి. 10 రోజులుగా ఈ పరిస్థితి ఉన్నా కార్పొరేషన్ అధికారులు పట్టించుకోకపోవడం విమర్శలకు తావిస్తోంది. స్థానికులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకురావడం, వెంటనే పరిష్కరించాలని ఆయన అధికారులను ఆదేశించినా మార్పు కనిపించలేదు.

మజ్దూర్ యూనియన్ అభ్యర్థుల ఏకగ్రీవం



గౌస్‌బాషాకు డిక్లరేషన్ ఇస్తున్న ఎన్నికల అధికారి

తిరుపతి(సెంట్రల్), జూన్ 30(ఆంధ్రజ్యోతి): తిరుపతి, రేణిగుంట రైల్వే ఇన్‌స్టిట్యూట్ ఎన్నికల్లో మజ్దూర్ యూనియన్ అభ్యర్థులు ఏకగ్రీవమయ్యారని ఎన్నికల అధికారి హరికృష్ణారెడ్డి ప్రకటించారు. రేణిగుంట రైల్వే ఇన్‌స్టిట్యూట్‌లో జరిగిన ఈ ఎన్నికల్లో సోమవారం నామినేషన్ల ఉపసంహరణ జరిగింది. 9 మంది తమ నామినేషన్లను ఉపసంహరించుకున్నారు. అంతకు ముందు ఎంప్లాయీస్ సంఘ్ నాయకులు మజ్దూర్ యూనియన్ నాయకులతో చర్చించి ఏకగ్రీవానికి అంగీకరించారు. దీంతో కార్యదర్శిగా తిరుపతికి చెందిన కేఎస్ గౌస్‌బాషా, సహాయ కార్యదర్శిగా ఆర్.సుధాకర్, కోశాధికారిగా బి.చిరంజీవి, కమిటీ సభ్యులుగా ఎం.సుదర్శన్ రెడ్డి, డి.నారాయణ, ఎం.శ్రీనివాసు, ఎండీ సమివుద్దీన్, ఆశీస్ రాజన్ సిన్హా, ఏ లక్ష్మీనారాయణ ఏకగ్రీవమైనట్లు ఎన్నికల అధికారి హరికృష్ణారెడ్డి ప్రకటించారు. విజయం సాధించిన వారికి యూనియన్ నాయకులు సురేష్ కుమార్, బీఎం బాషా, రవీంద్ర నాయక్, ఎస్ఎండీ గౌస్ తదితరులు శుభాకాంక్షలు తెలిపారు.

డ్రైనేజీ సమస్యలను పరిష్కరించండి



యశోదానగర్‌లో ధర్నా చేస్తున్న సీపీఎం నాయకులు

తిరుపతి(ఆటోనగర్), జూన్30(ఆంధ్రజ్యోతి): నగరంలో డ్రైనేజీ సమస్యను వెంటనే పరిష్కరించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు టి.సుబ్రమణ్యం, నగర కార్యదర్శి వేణుగోపాల్ డిమాండ్ చేశారు. ఈ మేరకు వారు సోమవారం యశోదానగర్‌లో ధర్నా చేశారు. 43, 44, 34, 35 డివిజన్లలో డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా తయారైందన్నారు. ఈ కారణంగా డ్రైనేజీ నీరు తాగునీటిలో కలుస్తున్నాయని తెలిపారు. ప్రజలు వ్యాధుల బారిన పడుతున్నారని పేర్కొన్నారు. సుందరయ్యనగర్, సప్తగిరి నగర్, యశోదానగర్, రైల్వే కాలనీల్లో ఈ సమస్య ఎక్కువగా ఉందన్నారు. అధికారులు స్పందించి శాశ్వత చర్యలు చేపట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు మాధవ్, నరేంద్ర, బుజ్జి, జయంతి, లోకేష్ తదితరులు పాల్గొన్నారు.

హర్యానా సదస్సుకు మునికృష్ణ

● జిల్లా నుంచి నామినేట్ చేసిన ప్రభుత్వం



తిరుపతి, జూన్ 30(ఆంధ్రజ్యోతి): హర్యానాలోని గురుగ్రామ్‌లో రెండు రోజుల పాటు నిర్వహించనున్న జాతీయ సదస్సుకు తిరుపతి నగరపాలక సంస్థ డిప్యూటీ మేయర్ ఆర్సీ మునికృష్ణకు ఆహ్వానం అందింది. రాష్ట్రంలోని 24 మున్సిపల్టీల నుంచి మేయర్, డిప్యూటీ మేయర్లలో (గుంటూరు మినహా) ఒక్కొక్కరికి మాత్రమే అవకాశం కల్పిస్తూ సోమవారం రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు విడుదల చేసింది. అందులో జిల్లా నుంచి తిరుపతి నగరపాలక సంస్థను జాతీయ సదస్సుకు ఎంపిక చేశారు. 'దేశ నిర్మాణంలో పట్టణ, స్థానిక సంస్థ పాత్ర, రాజ్యాంగ ప్రజాస్వామ్యం' అనే అంశంపై జూలై 3, 4 తేదీల్లో గురుగ్రామ్‌లో జరగనున్న సదస్సులో రాష్ట్రం నుంచి నామినేట్ అయిన 25 మంది ప్రతినిధులు హాజరుకానున్నారు.

వాహనం ఢీకొని భిక్షగాడి మృతి



మృతి చెందిన భిక్షగాడు

తిరుపతి(నేరవిభాగం), జూన్ 30(ఆంధ్రజ్యోతి): వాహనం ఢీకొని భిక్షగాడు మృతి చెందిన ఘటన సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద చోటు చేసుకుంది. సీఐ రామయ్య వివరాల మేరకు.. గుర్తు తెలియని వ్యక్తి అన్నమయ్య సర్కిల్ వద్ద కొంతకాలంగా భిక్షాటన చేసి జీవిస్తున్నాడు. గతనెల 18న రోడ్డుపై పడుకుని నిద్రిస్తుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొంది. ఈ ఘటనలో అతనికి తీవ్రగాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం రుయాకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు.

ఏపీ వెటరన్ జర్నలిస్టు యూనియన్ అధ్యక్షుడిగా జనార్దన్

తిరుపతి అర్బన్, జూన్ 30(ఆంధ్రజ్యోతి): ఏపీ వెటరన్ జర్నలిస్టు యూనియన్ అధ్యక్షుడిగా తిరుపతికి చెందిన టి.జనార్దన్, ఉపాధ్యక్షులుగా నరేంద్రరెడ్డి ఎన్నికయ్యారు. సోమవారం విజయవాడ ప్రెస్ క్లబ్‌లో ఏపీ వెటరన్ జర్నలిస్ట్ యూనియన్ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు.



‘హరిహర వీరమల్లు’లో పాట పాడా

తిరుమల, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): పవన్ కల్యాణ్ నటించిన ‘హరిహర వీరమల్లు’ చిత్రంలో ‘కొల్లగొట్టి నాదిరో’ అనే ఓ పాట పాడానని గాయకుడు రాహుల్ సిప్లిగంజ్ తెలిపారు. తిరుమల శ్రీవారిని సోమవారం దర్శించుకున్న ఆయన ఆలయం ముందు మీడియాతో మాట్లాడారు. తన తల్లి, కుటుంబ సభ్యులతో కలిసి శ్రీవారిని దర్శించుకోవడం చాలా సంతోషంగా ఉందన్నారు. సినిమా పాటలతో పాటు దేవుడి పాటలూ పాడుతున్నట్టు ఓ ప్రశ్నకు బదులిచ్చారు. అలాగే, సినీహీరో మాధవన్, నటి వాసుకి, మహారాష్ట్ర మంత్రి ప్రకాష్ అంబేద్కర్ తదితరులూ శ్రీవారిని దర్శించుకున్నారు.



రాహుల్ సిప్లిగంజ్ - మాధవన్



వాసుకి

శ్రీవారి సర్వదర్శనానికి 10 గంటలు

తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 10 గంటల సమయం పడుతోంది. సోమవారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2 లో 16 కంపార్టుమెంట్లలో సర్వదర్శన భక్తులు, వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 3 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు.

శనివారం హుండీ ఆదాయం: రూ.4.34 కోట్లు

ఆదివారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 88,497

తలనీలాలు సమర్పించినవారు: 29,054





నాసిరకం యంత్రాలు కొన్న వారిపై కేసు పెట్టాలి

టీటీడీ సభ్యుడు భానుప్రకాష్ డిమాండ్

తిరుపతి(ఎంఆర్‌పల్లె), జూన్ 30(ఆంధ్రజ్యోతి): టీటీడీ అయుర్వేద ఆస్పత్రి కోసం ట్యాబ్లెట్ మందులను తయారు చేసేందుకు గత పాలకవర్గంలో మూడు నాసిరకం మిషన్లను కొన్నారని ప్రస్తుత ధర్మకర్తల మండలి సభ్యుడు భానుప్రకాష్‌రెడ్డి ఆరోపించారు. ఈ ఘటనలో బాధ్యులపై కేసు నమోదు చేయాలన్నారు. తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో సోమవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. భక్తుల సొమ్మును గత వైసీపీ పాలకులు నాసిరక మిషన్ల పాలు చేశారని విమర్శించారు. అప్పటి టీటీడీ ఛైర్మన్ వైవీ సుబ్బారెడ్డి హయాంలో ఆయుర్వేద ఆస్పత్రి కోసం ట్యాబ్లెట్ మందులను తయారు చేసే మూడు మిషన్లను రూ.4కోట్లకు కొన్నారన్నారు. వీటిలో ఒకటి కాలిపోగా, మరో దానిలో మందుల పొడి బయటకు వస్తుందన్నారు. ఇంకో దానికి బోల్టులు ఊడిపోతున్నాయన్నారు. తమ పరిశీలనలో ఆ మిషన్లు సెకండ్‌హ్యాండ్‌విగా గుర్తించామన్నారు. వీటిని హైదరాబాద్‌లోని చిన్న రేకుల షెడ్‌లో ఉన్న సాయి తేజ స్టీల్‌కార్పొరేషన్ సప్లై చేసినట్లు తెలిసిందన్నారు. భక్తుల సొమ్ము రూ.4కోట్లను వృథా చేసి నాసిరకం మిషన్లు కొన్న వారిపై కేసులు నమోదు చేయాలన్నారు. వెంకటేశ్వరస్వామి సొత్తు తిన్నందుకే 11 సీట్లు ఇచ్చారన్నారు. వరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఇంజనీరింగ్ అసిస్టెంట్ల బదిలీ కౌన్సెలింగ్ వాయిదా

చిత్తూరు సిటీ, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని సచివాలయ అసిస్టెంట్ ఇంజనీర్ల బదిలీల కౌన్సిలింగ్ వాయిదా పడింది. చిత్తూరులో సోమవారం 449 మందికి చిత్తూరు పీఆర్ ఇన్‌చార్జి ఎస్‌ఈ చంద్రశేఖర్ రెడ్డి, తిరుపతి ఈఈ రామ్‌మోహన్, మదనపల్లె ఈఈ చంద్రశేఖర్ రెడ్డి సమక్షంలో కౌన్సెలింగ్ జరిగింది. సీఎం చంద్రబాబు నాయుడు పర్యటన నేపథ్యంలో మిగిలిన ఉద్యోగుల బదిలీలను వాయిదా వేశారు. అనంతరం కౌన్సెలింగ్ నిర్వహిస్తామని అధికారులు తెలిపారు.

పాఠశాలను విలీనం చేయొద్దు



శ్రీకాళహస్తి మండలం యార్లపూడి పంచాయతీ రాజుగుంటహరిజనవాడలోని పాఠశాలను విలీనం చేయవద్దని గ్రామస్తులు కోరారు. 50 సంవత్సరాలుగా గ్రామంలో ఉన్న పాఠశాలను మన్నవరం స్కూల్లో విలీనం చేశామని, పిల్లలను అక్కడికి పంపాలని చెప్పడం బాధాకరమన్నారు. తమ గ్రామంలో పాఠశాలను కొనసాగించాలని గ్రామస్తులు వజ్రమ్మ, సావిత్రమ్మ, సుబ్రహ్మణ్యం, నాగరాజు, జయచంద్ర కోరారు.

సమస్యలు పరిష్కరించండి

కలెక్టరేట్ ఎదుట ప్రజా సంఘాల ఆందోళన ● పీజీఆర్ఎస్‌కు 296 వినతులు ● అర్జీదారులతో కిక్కిరిసిన కలెక్టరేట్

తిరుపతి(కలెక్టరేట్), జూన్ 30(ఆంధ్రజ్యోతి): సమస్యలు పరిష్కరించాలని ప్రజలు, ప్రజా సంఘాలు, విశ్రాంత ఉద్యోగులు కలెక్టరేట్ వద్ద అందోళన చేపట్టారు. కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక(పీజీఆర్ఎస్)కు ప్రజలు హాజరై తమ సమస్యలను అధికారులకు విన్నవించారు. కలెక్టర్ వెంకటేశ్వర్, జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్, డీఆర్వో నరసింహులు, ఇతర అధికారులు అర్జీదారుల నుంచి వినతులు స్వీకరించారు. 296 వినతులు అందగా 145 రెవెన్యూ సంబంధితమైనవే ఉన్నాయి. ఉత్తరప్రదేశ్‌కు చెందిన కొంతమంది సాధువులు వచ్చి అధికారులను ఆశీర్వదించి వెళ్లారు.



ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ వెంకటేశ్వర్

రజకుల స్థలాన్ని ఆక్రమించిన వారిపై చర్యలు తీసుకోండి

రజకుల స్థలాన్ని ఆక్రమించిన వారిపై చర్యలు తీసుకోవాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి జయచంద్ర కోరారు. ఈ మేరకు కలెక్టర్ వెంకటేశ్వర్‌కు వినతిపత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ తిరుపతి రూరల్ పరిధిలోని పేరూరు పంచాయతీ యాదవ్‌కాలనీలో ఉండే రజకుల స్థలాన్ని పంచాయతీ అధికారి ఆక్రమించి కంచె వేయడం దుర్మార్గమన్నారు. 2014లో ప్రభుత్వం రజకులకు 50 సెంట్లు కేటాయించిందన్నారు. ఆ ప్రాంతంలో ప్రభుత్వమే తొట్టిలు, బోర్లు వేయించనట్లు చెప్పారు. ఆ స్థలం చుట్టూ కంచె వేయడం దుర్మార్గమని, వెంటనే దాన్ని తొలగించాలని కోరారు. జిల్లా నాయకులు చిన్నబాబు, పుల్లయ్య, శివయ్య, సురేంద్ర, మునెప్ప, చంద్రశేఖర్, చంద్రబాబు, కోమల, కుసుమ, భూదేవి పాల్గొన్నారు.

తప్పుడు ఎండార్స్‌మెంట్లు ఇచ్చారు

రెవెన్యూ సమస్యలు పరిష్కారమైనట్లు తప్పు డు ఎండార్స్‌మెంట్ ఇస్తున్న సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వందవాసి నాగరాజు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం కలెక్టరేట్‌లో జేసీ శుభం బన్సల్‌కు వినతిపత్రం అందజేశారు. నాగరాజు మాట్లాడుతూ గత డిసెంబరులో జరిగిన రెవెన్యూ సదస్సుల్లో 15,264 మంది తమ సమస్యలపై అర్జీలు ఇచ్చారని, అందులో ఎక్కువ భాగం పరిష్కారం కాకనే అయినట్లు అధికారులు ఎండార్స్‌మెంట్ ఇచ్చారని తెలిపారు. ఇలాంటి తప్పుడు నివేదికలపై విచారణ జరిపి, బాధ్యులైన అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

పార్కింగ్ స్థలాన్ని కాపాడండి

నాయుడుపేటలో మినీ ట్రక్ వ్యాన్‌లకు సంబంధించిన పార్కింగ్ స్థలాన్ని కాపాడాలని సీఐటీయూ ఆధ్వర్యంలో సోమవారం కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించారు. సీఐటీయూ నాయకులు జయచంద్ర, శివ, ముకుంద మాట్లాడుతూ నాయుడుపేట పంచాయతీగా ఉన్న సమయంలో ఆర్టీసీ బస్టాండుకు ఎదురుగా ఉన్న స్థలంలో ట్యాక్సీలు ఆపుకునేవారన్నారు. కాంప్లెక్స్ కట్టాలని ఖాళీ చేయమనడంతో పక్కనే ఉన్న ఆర్‌అండ్‌బీ శాఖకు చెందిన ఖాళీ స్థలంలో స్టాండ్ పెట్టుకున్నారన్నారు. 2019లో అన్న క్యాంటీన్ ఏర్పాటు పేరుతో దాన్ని ఖాళీ చేయించి అంబేద్కర్ భవన్ ఎదురుగా ఉన్న స్థలంలో పెట్టుకోవాలని సూచించారన్నారు. ఇప్పుడు ఉన్నఫలంగా ఖాళీ చేయమని మున్సిపల్ కమిషనర్ చెప్పడం బాధాకరమన్నారు. ప్రత్యామ్నాయం చూపించాలని కోరారు. గిరి, మస్తాన్‌రెడ్డి, హేమంత్, రమణయ్య, అమీర్, చెంచుకుప్పయ్య, జిలానీ, సతీష్ పాల్గొన్నారు.



ఫైనాన్స్ బిల్లులో లోపాలను సవరించండి



కలెక్టరేట్ ఎదుట ఆందోళన చేస్తున్న విశ్రాంత ఉద్యోగులు

కేంద్ర ప్రభుత్వం తెచ్చిన ఫైనాన్స్ బిల్లులో లోపాలని సవరించాలని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సంఘం నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు కలెక్టరేట్ వద్ద సంఘం ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. సంఘం జిల్లా అధ్యక్షుడు కేఆర్ శంకర్, సహాధ్యక్షుడు గోపాల్ మాట్లాడుతూ ఈ బిల్లులో భవిష్యత్తులో పెన్షనర్ల బేసిక్ పే పెంపుదల ఉండదని చెప్పడం బాధాకరమన్నారు. దీనిపై ఆందోళనలు చేస్తుండగా కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి కంటితుడుపు ప్రకటనలు చేయడం సరికాదని ఆవేదన వ్యక్తం చేశారు. పే రివిజన్ చేసినపుడు విశ్రాంత ఉద్యోగులకు బేసిక్ పే పెంపుదల చేయాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం సంవత్సర కాలంగా ఉద్యోగులు, విశ్రాంత ఉద్యోగులకు ఎలాంటి ఆర్థిక ప్రయోజనాలూ కల్పించలేదని తెలిపారు. పెండింగ్ డీఏలను ప్రకటించాలని, 12వ పీఆర్సీ కమిషన్‌ను నియమించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిద్ధయ్య, పాపయ్య, మునికృష్ణన్ తదితరులు పాల్గొన్నారు.

లోకల్ గైడ్స్ సమస్యలు పరిష్కరించండి

టూరిజం శాఖలో పనిచేస్తున్న లోకల్ గైడ్స్ సమస్యలను పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి జయచంద్ర కోరారు. ఈ మేరకు కలెక్టరేట్‌లో కలెక్టర్ వెంకటేశ్వర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ 1996లో టూరిజం ప్యాకేజీల్లో భాగంగా తిరుమలలో ప్రత్యేక దర్శనాలు కల్పించారని తెలిపారు. తద్వారా లోకల్ గైడ్లకు జీవనోపాధి దొరికిందన్నారు. అయితే కొంతమంది అధికారులు అవినీతికి పాల్పడ్డారనే నెపంతో గత ప్రభుత్వం టూరిజం కార్పొరేషన్లకు ఉన్న ప్రత్యేక దర్శనాలను రద్దు చేసిందని చెప్పారు. తద్వారా తిరుపతిలో ఉన్న సుమారు వందమంది లోకల్‌గైడ్స్ కుటుంబాలు వీధిన పడ్డాయని తెలిపారు. వెంటనే వారికి జీవనోపాధి కల్పించేలా చర్యలు తీసుకోవాలన్నారు. తిరుపతి గైడ్ యూనియన్ నాయకులు పెదిరెడ్డి, చంద్రమౌళి, నాగభూషణం, సురేష్, వెంకటేష్, శివ, ఏకాంత, శ్రీకాంత్, రాము, హరి పాల్గొన్నారు.

చిత్రజ్యోతి

★ SINCE 1965 ★



లుంగీ కట్టు.. మాస్ లుక్!

కిరణ్ అబ్బవరం, యుక్తి తరేజా జంటగా జైన్స్ నాని తెరకెక్కిస్తోన్న చిత్రం ‘కె-ర్యాంప్’. హాస్య మూవీస్, రుద్రాంశ్ సెల్యులాయిడ్ బేనర్లపై రాజేశ్ దండా, శివ బొమ్మకు నిర్మిస్తున్నారు. తాజాగా ఈ చిత్రం నుంచి ఫస్ట్ లుక్ పోస్టర్ రిలీజ్ చేశారు. కిరణ్ అబ్బవరం లుంగీ కట్టులో మాస్, క్లాస్ కలసిన మేకోవర్‌లో ఆకట్టుకుంటున్నారు. బ్యాక్‌గ్రౌండ్‌లో మందు బాటిల్స్‌తో డిజైన్ చేసిన లవ్ సింబల్ కనిపిస్తోంది. ప్రస్తుతం ఈ సినిమా చిత్రీకరణ తుది దశకు చేరుకుంది. ఈ దీపావళికి విడుదల చేసేందుకు చిత్రబృందం సిద్ధమవుతోంది.

ఓటీటీలోకి ‘తల్లి మనసు’



కమల్ కామరాజు, సాత్విక్, రచిత మహాలక్ష్మీ ప్రధాన పాత్రల్లో ముత్యాల సుబ్బయ్య తెరకెక్కించిన చిత్రం ‘తల్లి మనసు’. ముత్యాల అనంత కిశోర్ నిర్మించారు. ఇటీవలె చిత్రం విడుదలైంది. తాజాగా, ఈ సినిమా ఓటీటీ వేదిక అమెజాన్ ప్రైమ్‌లోకి అందుబాటులోకి వచ్చిందని మేకర్స్ తెలిపారు.



పూజతో ప్రారంభం

తమిళ నటుడు విజయ్ సేతుపతి కథానాయకుడిగా పూరి జగన్నాథ్ ఓ చిత్రాన్ని తెరకెక్కించనున్న సంగతి తెలిసిందే. సోమవారం ఈ చిత్రాన్ని పూజా కార్యక్రమాలతో ప్రారంభించారు మేకర్స్. విజయ్‌కుమార్, సంయుక్త, టబు కీలక పాత్రలు పోషిస్తున్నారు. చార్మీ కౌర్ సమర్పణలో పూరి జగన్నాథ్, జేబీ నారాయణరావు కొండ్రోల్లా సంయుక్తంగా సినిమాను నిర్మిస్తున్నారు. పాన్ ఇండియా స్థాయిలో చిత్రాన్ని రూపొందిస్తున్నారు. ప్రేక్షకులకు విభిన్నమైన అనుభూతిని ఈ సినిమా ద్వారా అందిస్తామని మేకర్స్ పేర్కొన్నారు. ఈ నెల నుంచి రెగ్యులర్ షూటింగ్ మొదలు కానుంది.

సున్నితమైన హాస్యంతో...

హీరో రాణా దగ్గుబాటి తన నిర్మాణ సంస్థ స్పిరిట్ మీడియా బ్యానర్‌పై రూపొందిస్తున్న చిత్రం ‘కొత్తపల్లిలో ఒకప్పుడు’. నూతన దర్శకురాలు ప్రవీణ పరుచూరి తెరకెక్కిస్తున్నారు. ఈ సినిమా గురించి మేకర్స్ మాట్లాడుతూ “సున్నితమైన హాస్యంతో నిండిన చిత్రమిది. అందర్నీ ఆలోచింపజేస్తుంది. ప్రేక్షకులకు సరికొత్త అనుభూతిని ఇస్తుంది” అని తెలిపారు. ప్రస్తుతం ఈ చిత్రం నిర్మాణ దశలో ఉంది.



కథలో భిన్న కోణాలుంటాయి

- శ్రీరామ్ వేణు



“తమ్ముడు’ సినిమాలో కుటుంబ భావోద్వేగాలు, భిన్న కోణాలు ఉంటాయి. ట్రైలర్‌లో కథ ఎలా ఉండబోతుందో చెప్పాం’ అని అన్నారు దర్శకుడు శ్రీరామ్ వేణు. నితిన్ హీరోగా ఆయన దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం ‘తమ్ముడు’. దిల్ రాజు, శిరీష్ నిర్మించారు. ఈ శుక్రవారం థియేటర్లలో విడుదలవుతున్న సందర్భంగా శ్రీరామ్ వేణు మీడియాతో మాట్లాడుతూ ‘ఈ చిత్రానికి సెన్సార్ వాళ్లు కొన్ని కట్స్ చెప్పారు. మేము ఆ కట్స్ వద్దనుకున్నాం. సినిమాలో హీరోతోపాటు ఐదుగురు మహిళా క్యారెక్టర్లు బలంగా ఉంటాయి. ‘విక్రమ్’లో కమల్ హాసన్ పాత్ర కథలో ఎలా ట్రావెల్ అవుతుందో అలా ఈ చిత్రంలోనూ ఉంటుంది. ఆర్చరీని కథలో చేర్చాలని చాలా సార్లు అనుకున్నాం. ‘తమ్ముడు’లో కుదిరింది. ఆర్చరీ ట్రైనర్‌తో నితిన్‌కు 15 రోజులు శిక్షణ ఇప్పించాం. కథలో ప్రధానంగా బ్రదర్ సిస్టర్ సెంటిమెంట్ ఉన్నా అనేక కోణాల్లో మూవీ సాగుతుంది. ‘కాంతారా’ చూశాక సప్తమి గౌడ మా మూవీలోని క్యారెక్టర్‌కు బాగుంటుందని అనిపించి తీసుకున్నాం. మ్యూజిక్ డైరెక్టర్ అజనీష్ లోకనాథ్ మంచి బ్యాక్ గ్రౌండ్ స్కోర్ ఇచ్చారు.

ఓ దినపత్రికలో వచ్చిన ఆర్టికల్ స్ఫూర్తితో ‘తమ్ముడు’ కథను సిద్ధం చేసుకున్నా. కథ విని దిల్‌రాజు గారు బడ్జెట్ గురించి ఆలోచించకుండా నిర్మించారు. ఈ కథకు సరిపోయే హీరో కోసం వెతికాం. నితిన్ బాగుంటాడని తీసుకున్నాం. లయ పాత్ర కోసం ఒకప్పటి స్టార్ హీరోయిన్‌కి కథ చెప్పాం. ఆమెకు కథ, క్యారెక్టర్ నచ్చింది. కానీ ఆమె వ్యక్తిగత కారణాల వల్ల నటించలేదు. అయితే మరోసారి ఇలాంటి క్యారెక్టర్ వస్తే తప్పకుండా నటిస్తానని చెప్పారు. నా ప్రతి సినిమా ఒక కొత్త జానర్‌లో ఉంటుంది. నేనెప్పుడూ జానర్ రిపీట్ చేయలేదు. నా స్క్రిప్ట్‌లో ఫిమేల్ క్యారెక్టర్లకు ఎక్కువ ప్రాధాన్యం ఉంటుంది. ఇప్పటి దాకా అలా చేస్తూ వచ్చాను. తరవాత సినిమాకు ఎలా ఉంటుందో ఇప్పుడే చెప్పలేను’ అని అన్నారు.

అల్లరి నరేశ్ ‘ఆల్కహాల్’



హాస్య చిత్రాలతో తెలుగు ప్రేక్షకుల హృదయాల్లో చెరగని స్థానం సంపాదించుకున్న అల్లరి నరేశ్, వైవిధ్యభరితమైన చిత్రాలతోనూ తన దైన ముద్ర వేస్తున్నారు. అదే కోవలో మరో వైవిధ్యమైన చిత్రంతో అలరించడం కోసం సితార ఎంటర్‌టైన్‌మెంట్స్‌తో చేతులు కలిపారు. ‘ఫ్యామిలీ డ్రామా’ ఫేమ్ మెహర్ తేజ్ ఈ చిత్రానికి దర్శకత్వం వహిస్తున్నారు. సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య నిర్మిస్తున్నారు. ఈ సినిమాకు ‘ఆల్కహాల్’ అనే టైటిల్ ఖరారు చేశారు. ఈ సందర్భంగా విడుదల చేసిన ఫస్ట్‌లుక్ పోస్టర్ ఆకట్టుకుంటోంది. కాగా, అల్లరి నరేశ్ సరసన రుహాని శర్మ కథానాయికగా నటిస్తున్నారు. ఈ చిత్రానికి సంబంధించిన మరిన్ని వివరాలు త్వరలో వెల్లడించనున్నట్లు చిత్రబృందం పేర్కొంది.

పుత్తూరు వార్తలు

స్టార్టర్ల చోరీ: ఆందోళనలో రైతులు


తిరుమణ్యం వద్ద చోరీకి గురైన స్టార్టర్

వడమాలపేట, జూన్ 30(ఆంధ్రజ్యోతి): మండలంలో రెండు రోజులుగా పొలాల వద్ద స్టార్టర్లు చోరీకి గురవుతున్నాయి. తిరుమణ్యం సమీపంలో ఆదివారం రాత్రి రైతు గురవారెడ్డికి చెందిన రెండు స్టార్టర్లను ధ్వంసం చేసి అందులోని రాగి తీగలను చోరీ చేశారు. శనివారం రాత్రి పాపరాజుకండ్రిగ సమీపంలో రైతులు వెంకటేశ్వర రావు, తదితరులకు చెందిన ఆరు స్టార్టర్లు చోరీకి గురయ్యాయి. రాత్రి వేళల్లో దుండగులు పొలాల వద్ద మాటువేసి ఫ్యూజ్ క్యారియర్లు పీకేసి స్టార్టర్ల చోరీలకు పాల్పడుతున్నారు. రెండు నెలల క్రితం ఓబీఆర్ కండ్రిగ, వేమాపురం, పాపరాజుకండ్రిగల్లో సుమారు 16 స్టార్టర్లను దుండగులు ఎత్తుకెళ్లారు. వరుస చోరీలతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఒక స్టార్టర్ సుమారుగా రూ. 5వేలు ఉంటుందని, చోరీలను అరికట్టాలని కోరుతున్నారు.

గుండెపోటుతో మహిళ మృతి


రాణి మృతదేహం

పుత్తూరు,జూన్30(ఆంధ్రజ్యోతి): స్థానిక మామిడి కాయల మండీ నుంచి కాయల బస్తాలను నెత్తిన మోసుకుని పుత్తూరు రైల్వే స్టేషన్‌కు వచ్చిన నగరి సమీపంలోని ఏకాంబరకుప్పానికి చెందిన రాణి(57) సోమవారం సాయంత్రం హఠాత్తుగా స్టేషన్ ఆవరణలోనే కింద పడి మృతి చెందింది. కింద పడిన వెంటనే గుండెపోటుగా భావించి సపర్యలు చేసినా ప్రయోజనం లేకపోయిందని తెలిపారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పుత్తూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. రాణి కుమారుడు ప్రభుత్వ ఆస్పత్రికి చేరుకున్నారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో తండ్రి మృతి

● కుమారుడికి తీవ్రగాయాలు


సుబ్రహ్మణ్యం మృతదేహం

పుత్తూరు అర్బన్, జూన్ 30(ఆంధ్రజ్యోతి): కుమారుడిని రైలు ఎక్కించేందుకు బైక్‌లో వెళ్తుండగా జరిగిన ప్రమాదంలో తండ్రి మృతి చెందాడు. కుమారుడు తీవ్రంగా గాయపడ్డాడు. పోలీసులు తెలిపిన వివరాలు... మండలంలోని ఎగువ కనకపాళెంకు చెందిన సుబ్రహ్మణ్యం(56) కుమారుడు సాయిభార్గవ్ చెన్నైలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తుంటాడు. శని, ఆదివారాలు సెలవు కావడంతో స్వగ్రామానికి వచ్చాడు. ఈక్రమంలో సోమవారం ఉదయం సాయిభార్గవ్‌ను రైలు ఎక్కించేందుకు ఎగువకనకపాళెంనుంచి నుంచి ద్విచక్రవాహనంలో సుబ్రమణ్యం పుత్తూరు రైల్వే స్టేషన్‌కు బయలు దేరాడు. ఉదయం 8 గంటల ప్రాంతంలో సీఆర్ నత్తం ఫ్లైఓవర్ వద్ద రోడ్డు దాటుతుండగా వీరి స్కూటర్‌ను మినీ లారీ ఢీకొని డివైడర్‌పైకి దూసుకెళ్లి ఆగిపోయింది. ఈ ఘటనలో సుబ్రహ్మణ్యం తలకు తీవ్రగాయమై సంఘటనా స్థలంలోనే మృతి చెందాడు. సాయిభార్గవ్‌కు తీవ్ర గాయాలయ్యాయి. మెరుగైన వైద్యం కోసం తిరుపతిలోని ప్రైవేటు ఆసుపత్రికి తీసుకెళ్లారు. మృతదేహాన్ని పుత్తూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ ఓబయ్య తెలిపారు.

న్యాయవాదులపై దాడి దుర్మార్గం

● కోర్టు విధులను బహిష్కరించిన న్యాయవాదులు



పుత్తూరు అర్బన్, జూన్ 30(ఆంధ్రజ్యోతి): న్యాయవాదులపై దాడులను దుర్మార్గపు చర్యగా అభివర్ణించారు పుత్తూరు బార్ అసోసియేషన్ సభ్యులు. రేపల్లె బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడిపై హత్యా ఘటన, చిత్తూరు బార్ అసోసియేషన్ న్యాయవాది సుధాకర్‌పై దాడిని తీవ్రంగా ఖండించారు. ఇందుకు నిరసనగా సోమవారం పుత్తూరు బార్ అసోసియేషన్ కార్యనిర్వాహక సంఘం అధ్యక్షుడు గాలిసురేష్ ఆధ్వర్యంలో న్యాయవాదులు కోర్టు విధులను బహిష్కరించారు. కోర్టు నుంచి అంబేడ్కర్ కూడలి వరకు నిరసన ర్యాలీ నిర్వహించారు. న్యాయవాదులు రవివర్మ, శ్రీనివాసులు, రాజేష్, దినకర్, దొరబాబు, నాదముని, భాస్కర్‌రావు, సాయి నరేష్ తదితరులు పాల్గొన్నారు.

నిరసన ఉధృతం చేస్తాం


మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రం ఇస్తున్న ఇంజనీరింగ్ అసిస్టెంట్లు

పుత్తూరు అర్బన్, జూన్ 30(ఆంధ్రజ్యోతి): తమ డిమాండ్లను పరిష్కరించాలని ప్రభుత్వాన్ని కోరుతూ చేపట్టిన నిరసనను ఉధృతం చేస్తామని ఇంజినీరింగ్ అసిస్టెంట్లు పేర్కొన్నారు. సోమవారం మున్సిపల్ కమిషనర్ మంజునాథ్ గౌడ్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు. ఎనిమిది రోజులుగా నిరసన చేపడుతున్నా ప్రభుత్వం నుంచి ఎటువంటి స్పందన లేదన్నారు. ఆంధ్రప్రదేశ్ మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మిక సంఘాల ఐక్య కార్యాచరణ కమిటీ పిలుపుమేరకు తాము పనిచేసే ప్రాంతాల్లో నీటి సరఫరాను నిలిపేస్తామని హెచ్చరించారు.

ద్విచక్ర వాహనాలపై అనధికార స్టిక్కర్ల తొలగింపు

రేణిగుంట, జూన్ 30, (ఆంధ్రజ్యోతి): పట్టణంలో ద్విచక్ర వాహనాలకు అనధికారికంగా వేసుకున్న స్టిక్కర్లను పోలీసులు తొలగించారు. సోమవారం సీఐ జయచంద్ర ఆదేశాల మేరకు అర్బన్ పోలీస్ స్టేషన్ పరిధిలో పోలీస్ స్టేషన్ సిబ్బంది పలు ప్రాంతాల్లో ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు. ద్విచక్ర వాహనాలపై అనాధికారికంగా వేసుకున్న ప్రెస్, పోలీస్, రెవెన్యూ, ఎండోమెంట్ స్టిక్కర్లను తొలగించారు.

సత్యవేడు (ఆంధ్రజ్యోతి): వాహనాలపై పోలీసు, ప్రెస్, ఫారెస్ట్, ఫైర్, ఈబీ తదితర నకిలీ స్టిక్కర్లు ఉంటే వాహనదారులపై చట్టపరమైన చర్యలు తప్పవని ఎస్ఐ రామస్వామి హెచ్చరించారు. సోమవారం గాంధీ విగ్రహం వద్ద సిబ్బందితో కలిసి వాహన తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా నకిలీ స్టిక్కర్లు వేసుకుని తిరుగుతున్న పలు వాహనాలను గుర్తించి, వాటిపై ఉన్న స్టిక్కర్లను తొలగించారు. ఆయా శాఖలకు సంబంధించిన ఉద్యోగులు మాత్రమే తమ వాహనాలపై స్టిక్కర్లు వేసుకోవాలని, అనధికారికంగా స్టిక్కర్లు వేసుకుంటే కేసులు నమోదు చేస్తామని తెలిపారు. అనంతరం పలు వాహనాల రికార్డులను పరిశీలించి, ధ్రువపత్రాలు లేని వాహనాలకు జరిమానా విధించారు.

గూడూరు సూళ్లూరుపేట/వెంకటగిరి

నేటి నుంచి క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు

వెంకటగిరి టౌన్, జూన్ 30(ఆంధ్రజ్యోతి): బంగారుపేట పీహెచ్‌సీ పరిధిలో సోమవారం తిరుపతిలోని శ్రీవెంకటేశ్వర వైద్య విజ్ఞాన సంస్థ (స్విమ్స్) ఆధ్వర్యంలో జూలై 1నుంచి ఉచితంగా క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించనున్నట్లు వైద్యాధికారి శివకృష్ణారెడ్డి సోమవారం తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లాలో రెండు పింక్ బస్సుల ద్వారా క్యాన్సర్‌పై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఇందులో భాగంగా బీపీ, షుగరు పరీక్షలతో పాటు నోటి క్యాన్సర్, రొమ్ము క్యాన్సర్, గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలను ఉచితంగా చేస్తామని చెప్పారు. 1వ తేదీన చింతగుంట, పాపమాంబాబపురం, 3న జంగాలపల్లి, పారవోలు, 4న పాళెంకోట, సోమసానిగుంటలో క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించనున్నట్లు వైద్యాధికారి తెలిపారు.

అదృశ్యమైన యువకుడి అప్పగింత

కోట, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): కోట పట్టణంలోని జయరామ్ నగర్‌కు చెందిన ముఖేష్ అనే యువకుడు అదృశ్యం అయిన సంగతి తెలిసిందే. అతడు ముంబాయిలో ఉన్నట్లు తెలుసుకున్న పోలీసులు సోమవారం కోటకు తీసుకువచ్చి ఎస్ఐ పవన్‌కుమార్ ఆధ్వర్యంలో తల్లిదండ్రులకు అప్పగించారు.

ఆర్థిక ఇబ్బందులను అధిగమిస్తూ.. అభివృద్ధికి బాటలు

చిగురుపాడు రోడ్డును ప్రారంభించిన ఎమ్మెల్యే విజయశ్రీ


చిగురుపాడు రోడ్డును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే విజయశ్రీ, నియోజకవర్గ ఇన్‌చార్జి నెలవల, విజయభాస్కర్‌రెడ్డి

నాయుడుపేట టౌన్, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): గత వైసీపీ ప్రభుత్వం చేసిన అప్పులతో ఆర్థిక ఇబ్బందులున్నా వాటిని అధిగమిస్తూ... ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు రాష్ట్ర అభివృద్ధికి బాటలు వేస్తున్నారని సూళ్లూరుపేట ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ అన్నారు. నాయుడుపేట మండలంలో రూ.1.96 కోట్లతో నిర్మించిన చిగురుపాడు రోడ్డును సోమవారం సాయంత్రం ఎమ్మెల్యే విజయశ్రీ, నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి నెలవల సుబ్రహ్మణ్యం ప్రారంభించారు. ఇచ్చిన మాట ప్రకారం ఏడాదిలోనే తమ గ్రామానికి రోడ్డు నిర్మాణం పూర్తి చేసినందుకు చిగురుపాడు గ్రామస్తులు ఆనందం వ్యక్తం చేస్తూ ఎమ్మెల్యే విజయశ్రీని గుర్రం మీద ఊరేగిస్తూ గ్రామంలోకి తీసుకెళ్లారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వంలో ఏ గ్రామమూ అభివృద్ధికి నోచుకోలేదన్నారు. కూటమి అధికారంలోకి రాగానే ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు కోట్లాది రూపాయలతో గ్రామాల్లో అభివృద్ధి పనులు చేపట్టారని అన్నారు. ఎన్నికల సమయంలో చిగురుపాడుకు వచ్చిన తనకు గ్రామస్తులు రోడ్డు అస్తవ్యస్తంగా ఉందని చెప్పడంతో ప్రభుత్వం ఏర్పడిన వెంటనే రోడ్డు నిర్మాణాన్ని పూర్తి చేస్తామని హామీ ఇచ్చామని, ఆ మేరకు మాట నిలబెట్టుకున్నామని చెప్పారు. నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి నెలవల సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ ఇచ్చిన హామీలను నిలబెట్టుకున్న ఘనత చంద్రబాబుకే దక్కిందన్నారు. ఆగస్టు 15వ తేదీ నుంచి మహిళలకు ఉచిత బస్సు పథకాన్ని ముఖ్యమంత్రి ప్రారంభించనున్నట్లు తెలిపారు. తల్లికి వందనం పథకం కింద కుటుంబంలో ఎంత మంది పిల్లలు ఉన్నా నగదు జమచేయడం జరిగిందన్నారు. త్వరలోనే అన్నదాత సుఖీభవ కార్యక్రమాన్ని ప్రారంభించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పంచాయతీరాజ్ ఈఈ రమణ, టీడీపీ నాయకులు శిరసనంబేటి విజయభాస్కర్‌రెడ్డి, గూడూరు ప్రభావతమ్మ, నెలవల రాజేష్, రఫీ, కట్టా రమణారెడ్డి, చెంచయ్య, పొట్లపూడి రాజేష్, నానాబాల సుబ్బారావు, నిత్యకృష్ణారెడ్డి, పల్లెటి రమణయ్య, నారాయణ, రవి, పాలేటి సుబ్రహ్మణ్యం, మణి, నరేంద్ర, శీను, గురవయ్య, గాలి రాజేష్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి: మాజీ మంత్రి పరసా


సమావేశంలో మాట్లాడుతున్న పరసారత్నం, పక్కనే బీసీ సంక్షేమ సంఘ నాయకులు ఆల్‌మెన్ రాజు, యాదగిరి, నాగరాజు గౌడ్ తదితరులు

సూళ్లూరుపేట, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): అంబేడ్కర్, పూలే ఫౌండేషన్ ద్వారా ప్రజా సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకే ప్రత్యేక చొరవ తీసుకుంటామని ఏపీఎఫ్ వ్యవస్థాపకుడు మాజీ మంత్రి పరసా వెంకటరత్నం అన్నారు. సోమవారం స్థానిక ఆర్‌అండ్‌బీ బంగ్లాలో విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ, వెనుకబడిన వర్గాల ప్రజలను ఒకే గొడుగుకిందకు తెచ్చేందుకు అంబేడ్కర్, పూలే ఫౌండేషన్ స్థాపించామన్నారు. ఆత్మగౌరవం, సామాజిక న్యాయం, రాజ్యాధికారం నినాదంతో బలహీన వర్గాలందరినీ సమన్వయం చేసుకుని ముందుకెళ్లామన్నారు. తొలిసారిగా ఈనెల 6న తిరుపతిలోని ఇందిరా మైదానంలో జరిగే జిల్లా స్థాయి బీసీ ఆత్మగౌరవ భరోసా సభకు అన్ని ప్రాంతాల నుంచి ప్రజలు తరలివచ్చి జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో రాష్ట్ర బీసీ సంక్షేమ సంఘ నాయకుడు కె.ఆల్‌మెన్ రాజు, జిల్లా అధ్యక్షుడు నాగరాజు గౌడ్, కార్యదర్శి సోమశేఖర్ ఆచారి, యాదగిరి, వాసుకుమార్ గౌడ్, స్థానిక నాయకులు కొక్కు శంకరయ్య, సుబ్రహ్మణ్యం, సుధాకర్ రెడ్డి, తిరుపాల్, శివయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూములను పేదలకు పంచాలి


సమావేశంలో ఏఐకేఎంఎస్ నాయకులు

గూడూరు, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): మైనింగ్ మాఫియా చేతుల్లో ఉన్న ప్రభుత్వ భూములను స్వాధీనం చేసుకుని వాటిని పేదలకు పంచాలని అఖిలభారత రైతుకూలీ సంఘం(ఏఐకేఎంఎస్) జాతీయ కార్యదర్శి భాస్కర్ అన్నారు. సోమవారం స్థానిక విశ్రాంత ఉద్యోగుల భవనంలో అఖిలభారత రైతుకూలీ సంఘం ఉమ్మడినెల్లూరు జిల్లా సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం మిగులు భూములను మైనింగ్ నిర్వాహకులు ఆక్రమించుకున్నారన్నారు. ఈ భూములలో సాగుచేసుకునేందుకు పేదలు దిగితే వారిపై అక్రమ కేసులు బనాయించడం దారుణమన్నారు. పేదలపై పెట్టిన అక్రమకేసులను వెంటనే ఎత్తివేయాలన్నారు. కేంద్రప్రభుత్వం వ్యవసాయ రంగాన్ని సైతం కార్పొరేట్ శక్తులకు కట్టబెట్టేందుకు పూనుకుంటుందన్నారు. సైదాపురం మండలంలోని ప్రభుత్వ భూములను పేదలకు పంపిణీ చేయాలన్నారు. కార్యక్రమంలో ఉమ్మడి నెల్లూరు జిల్లా అధ్యక్షుడు డీవీ పోలయ్య, కృష్ణయ్య, రమేష్, మమత, నవకోటి, చెంగల్‌రావు, అంకయ్య తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు ప్రతిభను పెంపొందించుకోవాలి



విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేస్తున్న ప్రిన్సిపాల్ శివప్రసాద్

గూడూరు, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు తమలోని ప్రతిభను పెంపొందించుకుని రాణించాలని ఎస్కేఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ శివప్రసాద్ అన్నారు. సోమవారం స్థానిక ఎస్కేఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఆర్ట్స్ విభాగంలో ఇటీవల షార్ట్‌టర్మ్ ఇంటర్న్‌షిప్ పూర్తిచేస్తున్న బీఏ విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫైన్‌ఆర్ట్స్‌లోని ఇంటర్న్‌షిప్ చేయడం ద్వారా చిత్రలేఖనంలో మెలుకువలను తెలుసుకుని విద్యార్థులు ప్రతిభను పెంపొందించుకోవడం జరిగిందన్నారు. కార్యక్రమంలో సురేంద్ర, డాక్టర్ పీర్ కుమార్, శ్రీనివాసులు, కోటేశ్వరరావు, కిరణ్మయి, శైలజ పాల్గొన్నారు.

స్టాంపుల కొరత లేకుండా చర్యలు

గూడూరు అర్బన్, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): రిజిస్ట్రేషన్ శాఖలో స్టాంపుల కొరత లేకుండా చర్యలు చేపట్టినట్లు స్టాంప్స్, రిజిస్ట్రేషన్స్ శాఖ డీఐజీ పసుపులేటి గిరిబాబు తెలిపారు. సోమవారం గూడూరు సబ్‌రిజిస్ట్రర్ కార్యాలయాన్ని తనిఖీ చేసిన ఆయన నిషేధిత భూముల జాబితా, ఈ-స్టాంపింగ్‌ల లావాదేవీలు, స్టాంపువెండర్ల రికార్డులను పరిశీలించారు. కార్యక్రమంలో సబ్‌రిస్ట్రార్లు నందకిషోర్, శ్రీనివాసులు, సిబ్బంది పవన్, గోకుల తదితరులు పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి పరామర్శ


షైక్ భాషాను పరామర్శిస్తున్న సర్వజ్ఞ కుమార యాచేంద్ర

వెంకటగిరి, జూన్ 30(ఆంధ్రజ్యోతి): వెంకటగిరి పట్టణం పీర్లాతిపేటకు చెందిన షైక్ భాషా కుమారుడు పఠాన్ నూర్ షార్జాన్ ఇటీవల ప్రమాదంలో మృతి చెందాడు. ఆంధ్రాక్రికెట్ అసోసియేషన్ మాజీ వైస్ ప్రెసిడెంట్ సర్వజ్ఞకుమార యాచేంద్ర సోమవారం షైక్ భాషా కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆయన వెంట 22వ వార్డు కౌన్సిలర్ గుమ్మళ్ల డిల్లీబాబు, 4వ వార్డు కౌన్సిలర్ నారాయణ తదితరులు ఉన్నారు.

నిబంధనలు పాటించని పాఠశాలలపై చర్యలు తీసుకోండి

గూడూరు అర్బన్, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): నిబంధనలు పాటించని ప్రైవేటు పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు శశికుమార్ అన్నారు. సోమవారం స్థానిక సనత్‌నగర్‌లోని ఓ ప్రైవేటు పాఠశాల వద్ద ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రైవేటు పాఠశాలలో విద్యాసామగ్రిని అధిక ధరలకు విక్రయిస్తున్నారన్నారు. అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సూర్య యశ్వంత్, భాను, గణేష్, సందీప్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మార్పీఎస్ సమావేశం

గూడూరు, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని విందూరు కండ్రిగ గ్రామంలో సోమవారం ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్ నాయకుడు సిసింద్రి మాట్లాడుతూ గ్రామస్థాయి నుంచి ఎమ్మార్పీఎస్‌ను బలోపేతం చేసేందుకు సమావేశం నిర్వహించి నూతన కమిటీలను ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఈనెల 7వ తేదీన ఆవిర్భావ దినోత్సవాన్ని ప్రతి గ్రామంలో నిర్వహించేందుకు సిద్ధమవుతున్నామని చెప్పారు.

తడి, పొడిచెత్త వేరు చేయడంపై అవగాహన

వెంకటగిరి, జూన్ 30(ఆంధ్రజ్యోతి): వెంకటగిరి మండల పరిధిలోని పెట్లూరు, పంజామ్, మొగళ్ళగుంట, కలపాడు, అమ్మపాళెం గ్రామాల్లో సోమవారం ఎంపీడీవో గుణశేఖర్ పర్యటించారు. తడి, పొడిచెత్త వేరు చేయడంపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. ఆయన వెంట డిప్యూటీ ఎంపీడీవో రమణయ్య, ఆయా పంచాయతీల కార్యదర్శులు పాల్గొన్నారు.

రైతులకు నష్ట పరిహారం అందించండి

పెళ్లకూరు, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): గతేడాది రబీలో సంభవించిన తుఫాన్ కారణంగా నష్టపోయిన రైతులకు పరిహారం అందించాలని భారతీయ కిసాన్ సంఘ్ జిల్లా కార్యదర్శి పాదర్తి రాజారెడ్డి డిప్యూటీ కలెక్టర్ రోజ్‌మాండ్‌కు వినతిపత్రం అందజేశారు. అలాగే మార్కెట్‌లో అధిక ధరలకు యూరియా విక్రయిస్తున్నట్లు వ్యవసాయ అధికారుల దృష్టికి తీసుకెళ్లారు.

పుస్తకాల పంపిణీ

వెంకటగిరి టౌన్, జూన్ 30(ఆంధ్రజ్యోతి): ప్రముఖ దిల్‌రుబా వాయిద్య చివరి కళాకారుడు, సంగీతజ్ఞాని, విద్యావేత్త శ్రీహరిదాసు శ్రీనివాసరావు ప్రథమ వర్ధంతి సందర్భంగా మనబడి మనమిత్రులు సభ్యులు సోమవారం ఆర్వీఎం ఉన్నత పాఠశాల విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేశారు. సుబ్బారావు, మురళి, నర్రారవి, రాజారామ్(చిట్టి), రవికుమార్, శ్రీనివాసరావు, బాలాజీ పాల్గొన్నారు.

నిత్యావసరాల అందజేత


బాధితులకు నిత్యవసరాలు అందజేస్తున్న తహసీల్దార్ విజయలక్ష్మి

బాలాయపల్లి, జూన్ 30(ఆంధ్రజ్యోతి): మండలంలోని కాలగంధ పంచాయతీ పరిధిలో గల కోనంగుంట గిరిజన కాలనీకి చెందిన మేకల అంకయ్య పూరిల్లు ప్రమాదశాత్తు ఇటీవల దగ్ధమైంది. గూడు కోల్పోయి నిరాశ్రయులైన అంకయ్య కుటుంబానికి సోమవారం తహసీల్దార్ విజయలక్ష్మి నిత్యావసర సరుకులు, నగదు అందజేశారు. కార్యక్రమంలో ఆర్ఐ శ్రీకాంత్, వీఆర్వో మేకలయ్య పాల్గొన్నారు.

నల్లమందు తిని గేదెకు గాయాలు

బాలాయలిపల్లి, జూన్ 30(ఆంధ్రజ్యోతి): మండలంలోని సుబ్రమణ్యం గ్రామస్తుడు వెంకటయ్యకు చెందిన గేదె నల్లమందు తిని తీవ్ర గాయాలపాలైంది. పొలాల్లో అడవి పందుల బారి నుంచి పంటలను కాపాడుకునేందుకు కొందరు నల్లమందు పెట్టారు. సోమవారం మేతకు వెళ్లిన గేదె నల్లమందు తినడంతో అది పేలి తీవ్రంగా గాయపడింది. అలాగే రెండు రోజుల క్రితం బాలాయపల్లి వాసి నాగయ్యకు చెందిన ఆవు నల్లమందు తిని చనిపోయినట్లు స్థానికులు తెలిపారు.

మాజీ మంత్రి పరసారత్నంను గవర్నర్‌గా నియమించాలి

నాయుడుపేట, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): మాజీ మంత్రి, టీడీపీ సీనియర్ నేత డాక్టర్ పరసారత్నంను గవర్నర్‌గా నియమించాలని ఏపీఎఫ్ రాష్ట్ర కన్వీనర్ ఆల్‌మెన్‌రాజు అన్నారు. నాయుడుపేట ఆర్‌అండ్‌బీ అతిథిగృహలో సోమవారం రాత్రి జరిగిన సమావేశంలో ఆల్‌మెన్‌రాజు మాట్లాడుతూ ఉన్నత విద్య అభ్యసించి టీడీపీ కోసం అహర్నిశలు పాటుపడిన పరసాను గవర్నర్ పదవికి సిఫారసు చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబుకు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు నాగరాజుగౌడ్, జేబీకేఎస్ జాతీయ అధ్యక్షుడు యాదగిరి, తిరుపతి బీసీ సంఘం అధ్యక్షుడు జగదీష్, ఏపీఎఫ్ జిల్లా కన్వీనర్ రఘునాథ్‌సింగ్ తదితరులు పాల్గొన్నారు.

నేడు పలు రైళ్ల రద్దు

తడ, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): చెన్నై - గూడూరు మార్గంలోని గుమ్మిడిపూడి - కవరోపేట రైల్వే స్టేషన్‌ల ఇంజనీరింగ్, సిగ్నల్ వ్యవస్థ మార్పులు పనులు జరుగుతున్న క్రమంలో మంగళవారం మధ్యాహ్నం 1.20 నుంచి సాయంత్రం 5.20వరకు పలు రైళ్లను రద్దు చేస్తున్నట్లు సదరన్ రైల్వే చెన్నై డివిజన్ అధికారులు ప్రకటించారు.

రద్దు అయిన రైళ్ల వివరాలు...

- సూళ్లూరుపేట నుంచి నెల్లూరుకు ఉదయం 8.10 నిమిషాలకు బయలుదేరి వెళ్లే మెమూ రైలు నెంబరు 66035
- నెల్లూరు నుంచి సూళ్లూరుపేటకు ఉదయం 10.20 నిమిషాలకు బయలుదేరి వచ్చే మెమూ రైలు నెంబరు 66036
- చెన్నై మోర్‌మార్కెట్ కాంప్లెక్స్ నుంచి సూళ్లూరుపేటకు ఉదయం 5.40, 10.15, మధ్యాహ్నం 12.10 వచ్చే ఈఎంయూ లోకల్ రైళ్లు.
- సూళ్లూరుపేట నుంచి చెన్నై మోర్‌మార్కెట్ కాంప్లెక్స్‌కు మధ్యాహ్నం 12.35, 1.15, 3.10 వచ్చే ఈఎంయూ లోకల్ రైళ్లు.
- చెన్నై నుంచి గుమ్మిడిపూడికి ఉదయం 10.30, 11.35, మధ్యాహ్నం 12.40, 1.40, 2.40 ఈఎంయూ లోకల్ రైళ్లు.
- గుమ్మిడిపూడి నుంచి చెన్నైకు మధ్యాహ్నం 1.00, 2.30, 3.15, 3.45, 4.30 బయలుదేరి వెళ్లే ఈఎంయూ లోకల్ రైళ్లు రద్దు అయ్యాయి.

వీటితో పాటు చెంగల్‌పట్టు, గుమ్మిడిపూడి, తాంబ్రం మధ్య నడిచే ఈఎంయూ లోకల్ రైళ్లు పాక్షికంగా రద్దు కాగా... చెన్నై మోర్‌మార్కెట్ కాంప్లెక్స్, ఆవడి మధ్య నడిచే పలు ఈఎంయు లోకల్ రైళ్లు రద్దు చేసినట్లు సదరన్ రైల్వే చెన్నై డివిజన్ అధికారులు తెలిపారు.

కోట మండల టీడీపీ అధ్యక్షుడిగా భాస్కర్‌రెడ్డి


ఎమ్మెల్యే సునీల్‌కుమార్, నియోజకవర్గ పరిశీలకుడు శివకోటేశ్వరరెడ్డి, మండల అధ్యక్షుడు భాస్కర్‌రెడ్డిని సత్కరిస్తున్న నాయకులు

కోట, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): కోట మండల టీడీపీ అధ్యక్షుడిగా కొక్కుపాడు గ్రామానికి చెందిన పలగాటి భాస్కర్‌రెడ్డి నియమితులయ్యారు. ఈ మేరకు ఎమ్మెల్యే డాక్టర్ పాశిం సునీల్‌కుమార్, నియోజకవర్గ టీడీపీ పరిశీలకుడు ఈశ్వరవాక శివకోటేశ్వరరెడ్డి అధికారికంగా భాస్కర్‌రెడ్డి పేరును ప్రకటించారు. పార్టీ ఆవిర్భావం నుంచి కొనసాగుతున్న భాస్కర్‌రెడ్డి పలు కీలక బాధ్యతలు నిర్వహించారు.

ఎస్సీ, ఎస్టీల సమస్యలకు సత్వర పరిష్కారం


సమావేశంలో మాట్లాడుతున్న సబ్‌కలెక్టర్ రాఘువేంద్రమీనా

గూడూరు అర్బన్, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ, ఎస్టీల సమస్యలను సత్వరమే పరిష్కరించేలా అధికారులు చొరవ చూపాలని సబ్‌కలెక్టర్ రాఘువేంద్రమీనా అన్నారు. సోమవారం స్థానిక సబ్‌కలెక్టర్ కార్యాలయంలో ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ సంక్షేమ పథకాలు పేదలందరికీ అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రధానంగా ఎస్సీ, ఎస్టీలకు సంబంధించి భూసమస్యలను త్వరిగతిన పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో వివిధశాఖల అధికారులు, మానిటరింగ్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

రిటైర్డ్ ఉద్యోగులకు సన్మానం


ఎంఈవో, తహసీల్దార్, పీఆర్ ఏఈలను సన్మానిస్తున్న అధికారులు

వెంకటగిరి టౌన్, జూన్ 30(ఆంధ్రజ్యోతి): మండల విద్యాశాఖ అధికారి వెంకటేశ్వర్లు, తహసీల్దార్ రాంబాబు, పీఆర్ ఏఈ కమలావిష్ణు సోమవారం ఉద్యోగ విరమణ చేశారు. వారిని అధికారులు ఘనంగా సన్మానించారు.

కోట: మండల పరిధిలోని చిట్టేడు ఎస్సీఆర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల జీవశాస్త్ర ఉపాధ్యాయురాలు విజయలక్ష్మికి సోమవారం ఉద్యోగ విరమణ చేశారు. ఆమెను హెచ్‌ఎంతో పాటు ఉపాధ్యాయులు విద్యాకమిటీ చైర్మన్ శ్రీనివాసులు షీల్డ్‌లు, మెమోంటోలతో సత్కరించారు. అలాగే జరుగుమల్లి ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం పద్మావతి ఉద్యోగ విరమణ చేయడంతో ఎంఈవో మస్తానయ్య, ఉపాధ్యాయ సంఘాల నేతలు సత్కరించారు.

సూళ్లూరుపేట: మండలంలోని మంగళంపాడు జడ్పీ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వెంకటేశ్వర్లు ఉద్యోగ విరమణ చేశారు. ఆయనను గ్రామస్తులు, విద్యార్థులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఎంఈవో శ్రీనివాసులురెడ్డి, గ్రామస్తులు పాల్గొన్నారు.

దొరవారిసత్రం: మండలంలోని శ్రీధనమల్లి గ్రామ పంచాయతీ కార్యదర్శిగా పనిచేస్తూ ఉద్యోగ విరమణ పొందిన ఖాదర్ మస్తాన్‌ను అధికారులు, నాయకులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో డీఎల్‌డీవోలు సురేష్ బాబు, రమణయ్య, ఎంపీడీవోలు గోవర్ధన్, మురళి, శ్రీనివాసులు, వైస్ ఎంపీపీ గోపాల్‌రెడ్డి, టీడీపీ నాయకులు శ్రీనివాసులు నాయుడు, పామంజి శ్రీనివాసులు, మందాటి పురుషోత్తం, సర్పంచ్‌లు మురళిరెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, పురుషోత్తం తదితరులు పాల్గొన్నారు.

వాకాడు: మండలంలోని బాలిరెడ్డిపాళెం వీఆర్వో విన్నమాల పోలయ్య సోమవారం ఉద్యోగ విరమణ చేశారు. ఆయనను తహసీల్దారు రామయ్య, డిప్యూటీ తహసీల్దారు సందీప్, ఎంపీడీవో శ్రీనివాసులు, ఆర్ఐ అఖీల్‌యాదవ్, రెవెన్యూ సిబ్బంది, వీఆర్వోలు సన్మానించారు.

పాలిటెక్నిక్ ప్రవేశాలకు వెబ్ ఆప్షన్ల ప్రారంభం

సత్యవేడు, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): పాలిటెక్నిక్ కోర్సుల్లో అడ్మిషన్ల కోసం ప్రవేశ పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించిన అభ్యర్థులకు సోమవారం వెబ్ ఆప్షన్ల నమోదు ప్రారంభమైంది. స్థానిక ప్రభుత్వ పాలిటెక్నిక్‌లో ఏర్పాటు చేసిన హెల్ప్‌డెస్క్‌లో ప్రిన్సిపాల్ ఉషాదేవి ఆధ్వర్యంలో అధ్యాపక బృందం వెబ్‌ఆప్షన్ల నమోదు ప్రక్రియ చేపట్టారు. ఇందులో భాగంగా తొలి రోజు 1 నుంచి 50 వేల ర్యాంకు వచ్చిన అభ్యర్థులకు వారు ఎంచుకున్న కళాశాలలు, కోర్సులకు వెబ్ ఆప్షన్లను నమోదు చేయించారు. ఈ ప్రక్రియ జూలై 5 వరకు కొనసాగుతుందని ప్రిన్సిపాల్ తెలిపారు. జూలై 6న మరోసారి ఆప్షన్లు మార్చుకునే వెసులు బాటు ఉంటుందన్నారు. జూలై 9న సీట్ల కేటా యింపు తుది జాబితా వెలువడుతుందని, జూలై 10 నుంచి 14వ తేదీ వరకు అభ్యర్థులు వారికి కేటాయించిన కళాశాలల్లో అడ్మిషన్లు పొందాలని తెలిపారు.

మాన్యశ్రీకి ఎమ్మెల్యే అభినందన


మాన్యశ్రీతో ఎమ్మెల్యే తదితరులు

పిచ్చాటూరు, జూన్ 30(ఆంధ్రజ్యోతి): యోగాంధ్ర పోటీల్లో రాష్ట్ర ఛాంపియన్‌గా నిలిచిన మాన్యశ్రీని ఎమ్మెల్యే ఆదిమూలం ఘనంగా సత్కరించారు. సోమవారం పిచ్చాటూరు టీడీపీ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ పిచ్చాటూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థిని మాన్యశ్రీ యోగా పోటీల్లో రాష్ట్ర స్థాయిలో ప్రథమ స్థానం పొంది జాతీయ స్థాయికి ఎంపిక కావడం గర్వకారణమన్నారు. తల్లిదండ్రులు లక్ష్మి, ఆనంద్‌తో పాటు యోగా నేర్పిన గురువు మల్లీశ్వరిని అభినందించారు.ఏఎంసీ మాజీ ఛైర్మన్ ఇళంగోవన్‌రెడ్డి, హెచ్‌ఎం గిరిప్రకాష్, పద్దురాజు, వాసురెడ్డి, దొరైవేలు, వినాయగన్, డీలర్ బాబు, రవి, యువశ్రీ తదితరులు పాల్గొన్నారు.

సమన్వయంతో సమస్యలను పరిష్కరిద్దాం



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆదిమూలం

కేవీబీపురం, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): అధికారులతో సమన్వయం చేసుకుని మండలంలో తాగునీటి సమస్యను పరిష్కరిస్తానని ఎమ్మెల్యే ఆదిమూలం చెప్పారు. కేవీబీపురం ఎంపీడీవో కార్యాలయంలో సోమవారం ఎంపీపీ మునిలక్ష్మి ఆధ్వర్యంలో సాధారణ సర్వసభ్య సమావేశం జరిగింది. సమావేశానికి ఎమ్మెల్యే ఆదిమూలం ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... కండ్లూరు, కర్లపూడి, ఎస్ఎస్‌కండ్రిగ, బ్రాహ్మణపల్లి, కళత్తూరు, శ్రీనివాసపురం, కస్తూరిపురం ఎస్టీకాలనీల్లో తాగునీటి సమస్య పరిష్కారం కోసం రూ.20లక్షలు మంజూరయ్యాయని చెప్పారు. బోర్లకు మరమ్మతులు చేపట్టడమేకాకుండా, కొత్త బోర్లు వేస్తామన్నారు. రెవెన్యూ సమస్యల పరిష్కారానికి కలెక్టరుతో చర్చిస్తానని తెలిపారు. తమ గ్రామాల్లోకి పాఠశాలలను, విద్యార్థులను ఇతర బడుల్లో విలీనాన్ని ఆపాలని పలువురు ఎమ్మెల్యేను కోరగా విద్యాశాఖ మంత్రి లోకేశ్‌తో మాట్లాడి సమస్య పరిష్కరి స్తామని హామీ ఇచ్చారు. జడ్పీటీసీ సభ్యురాలు మునెమ్మ, వైస్‌ఎంపీపీ సరస్వతి, ఎంపీడీవో మాలతి తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడటంతోనే సెక్యూరిటీ గార్డు మృతి

రేణిగుంట, జూన్ 30, (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో గాయపడడంతోనే లిక్కర్ గోడౌన్ సెక్యూరిటీ గార్డ్ మృతి చెందాడని గాజులమండ్యం ఎస్ఐ సుధాకర్ చెప్పారు. అక్కడి సీసీ ఫుటేజీ ఆధారంగా వివరాలు తెలిశాయని ఎస్ఐ చెప్పారు. తిరుపతి నగరంలోని లీలామహల్ వద్ద నివాసం ఉంటున్న కృష్ణారెడ్డి(65) తిరుపతి - రేణిగుంట మార్గంలోని వాల్‌మార్ట్ వెనుక ఉన్న లిక్కర్ గోడౌన్‌లో సెక్యూరిటీ గార్డుగా విధులు నిర్వహిస్తున్నాడు. ఆదివారం తెల్లవారుజామున 5 గంటలకు విధులు ముగించుకుని తిరుపతికి ఆటోలో వెళ్తుండగా వాహనం బోల్తాపడింది. ఈ ఘటనలో కృష్ణారెడ్డి, గోపి గాయపడ్డారు. తెల్లవారుజాము కావడంతో అటుగా ఎవ్వరూ రాకపోవడంతో కొంత సేపటికి వారే ఆటోను పైకి లేపి అందులో రేణిగుంటకు బయలు దేరారు. అయితే కృష్ణారెడ్డి తనను లిక్కర్ గోడౌన్ వద్ద దింపాలని కోరాడు. ఆయన్ను గోడౌన్ వద్ద దింపి గోపి చికిత్స కోసం వెళ్లిపోయాడు. అక్కడి సమీపంలో ఉన్న సీసీ కెమెరాల ఆధారంగా ఆటో డ్రైవర్ గోపిని గుర్తించి విచారించామన్నారు.

వైద్యులు నడిచే దేవుళ్లు: డీఎస్పీ


సత్కారం పొందిన వైద్యులు

శ్రీకాళహస్తి, జూన్ 30 (ఆంధ్రజ్యోతి) : వైద్యులు నడిచే దేవుళ్లని శ్రీకాళహస్తి డీఎస్పీ నరసింహమూర్తి అన్నారు. పట్టణంలోని యంగ్ ఎంప్లాయీస్ సోషల్ సర్వీస్ కార్యాలయంలో సోమవారం వైద్యుల దినోత్సవం సందర్భంగా పలువురిని సత్కరించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన డీఎస్పీ మాట్లాడుతూ... వైద్య వృత్తి ఎంతో పవిత్రమైందన్నారు. నిత్యం ప్రమాదకర ఇన్‌ఫెక్షన్ల మధ్య వైద్యులు ప్రజల ప్రాణ రక్షణే ధ్యేయంగా పనిచేస్తున్నారని చెప్పారు. అనంతరం పలు ప్రభుత్వ వైద్యశాలల్లో పనిచేసే వైద్యులను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో హేమకుమార్, ప్రదీప్, డిప్యూటీ డీఎంహెచ్‌వో మృదుల వాణి, శ్రీకాళహస్తి ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంటు మణి, ఇన్‌చార్జి ఆర్‌ఎంవో మురళీకృష్ణ, ఈఎన్‌టీ వైద్యాధికారి శ్రీనివాసులురెడ్డి, పీహెచ్‌సీ వైద్యులు చంద్రమోహన్, బాలు, మాధవ్, శివ ప్రియ, లావణ్య రంజిత తదితరులు పాల్గొన్నారు.

దళిత, గిరిజనులపై వివక్ష నేరం

బుచ్చినాయుడుకండ్రిగ, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): దళిత, గిరిజనులపై వివక్ష చూపితే చట్టరీత్యా నేరమని ఎంపీడీవో వెంకటరత్నమ్మ తెలిపారు. మండలంలోని నీర్పాకోట గిరిజన కాలనీలో సామాజిక న్యాయంపై రెవెన్యూ, మండల పరిషత్, పోలీసు శాఖల ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... ఎస్సీ, ఎస్టీలకు ప్రభుత్వం కల్పిస్తున్న హక్కులపై అవగాహన కలిగి ఉండాలన్నారు. ప్రభుత్వ పథకాలను గిరిజనులకు చేర్చాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అనంతరం పలు సమస్యలను గిరిజనులు అధికారులు దృష్టికి తీసుకొచ్చారు. ఎంఈవో రవీంద్రనాథ్, ఆర్ఐ నల్లయ్య, వెలుగు ఏపీఎం మునెయ్య, ఉపాధి ఏపీవో దేవరి, వీఆర్వో జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలల విలీనంపై కొనసాగుతున్న నిరసనలు


ఆముదూరు పాఠశాల ముందు గ్రామస్తుల నిరసన - కలెక్టరేట్ వద్ద పేరడంవాసుల ఆందోళన

ఏర్పేడు, జూన్ 30, (ఆంధ్రజ్యోతి): మండలంలో పలు పాఠశాలలను విలీనం చేయడంపై విద్యార్థులు, వారి తల్లిదండ్రులు నిరసన వ్యక్తం చేస్తున్నారు. అముదూరులో ఉన్న ప్రభుత్వ పాఠశాలను రాజులపాళెం పాఠ శాలలో కలిపారు. దీంతో అముదూరువాసులు పాఠశాల ముందు ఆందోళనకు దిగారు. పాగాలి గ్రామంలో పాఠశాలను కాట్రకాయలగుంట పాఠశాలలో విలీనం చేశారు. దీంతో పాగాలి గ్రామస్తులు, చిన్నారులు పాఠశాల ముందు నిరసన తెలిపారు.

సత్యవేడు (ఆంధ్రజ్యోతి): తమ గ్రామంలోని ప్రాథమిక పాఠశాల విలీన ప్రక్రియను ఉపసంహరించుకోవాలని సత్యవేడు మండలం పేరడం గ్రామస్తులు సోమవారం కలెక్టరేట్‌లో జరిగిన గ్రీవెన్స్‌లో కలెక్టర్ వెంకటేశ్వర్‌కు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు పలువురు మాట్లాడుతూ గ్రామంలోని పాఠశాలలో 3, 4, 5 తరగతులను నాలుగు కిలోమీటర్ల దూరంలో ఉన్న మదనంబేడు పాఠశాలలో విలీనం చేస్తే తమ పిల్లలు మెయిన్ రోడ్డు ద్వారా ప్రతిరోజు పాఠశాలకు వెళ్లి రావడం ప్రమాదరకరంగా మారుతోందని ఆవేదన వ్యక్తం చేశారు.

సీఎం రేవంత్ రెడ్డికి ముక్కంటి ప్రసాదాలు



శ్రీకాళహస్తి, జూన్ 30 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డికి టీడీపీ సీనియర్ నాయకులు కె.మోహన్ రెడ్డి ముక్కంటి ప్రసాదాలు అందజేశారు. తొట్టంబేడు మండలం కన్నలి గ్రామానికి చెందిన మోహన్‌రెడ్డి సోమవారం హైదరాబాదులో సీఎం రేవంత్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి ముక్కంటి ప్రసాదాలను అందజేశారు.

తహసీల్దార్ బాధ్యతల స్వీకరణ

కేవీబీపురం, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): కేవీబీపురం తహసీల్దార్‌గా రోశయ్య సోమవారం బాధ్యతలు చేపట్టారు. గత కొంతకాలంగా తహసీల్దార్ పోస్టు ఖాళీగా ఉండడంతో ఆ స్థానంలో రోశయ్యను నియమించినట్లు తెలిపారు. ఆయనకు రెవెన్యూ సిబ్బంది సాదరంగా ఆహ్వానం పలికి సన్మానించారు.

ముక్కంటి ఆలయంలో భక్తుల రద్దీ



శ్రీకాళహస్తి, జూన్ 30 (ఆంధ్రజ్యోతి) : ముక్కంటి ఆలయంలో సోమవారం భక్తుల రద్దీ నెలకొంది. వేకువజాము నుంచే భక్తులు క్యూలైన్‌లో బారులు తీరారు. తెలుగు రాష్ట్రాల నుంచే కాకుండా అధిక సంఖ్యలో భక్తులు విచ్చేశారు. సోమవారం ఉదయం రాహు కాలం సమయంలో రాహుకేతు సర్ప దోష నివారణ పూజలు జరిపించుకునేందుకు భక్తులు విశేషంగా ఆసక్తి చూపారు. దాంతో ఈ సమయంలో రద్దీ అత్యధికంగా నెలకొంది. ఉదయం నుంచి రాత్రి వరకు సుమారు 30 వేల మంది భక్తులు దర్శించుకున్నట్లు అధికారులు చెప్పారు.

ముక్కంటి సేవలో సింగర్ రాహుల్ సిప్లిగంజ్



శ్రీకాళహస్తి, జూన్ 30 (ఆంధ్రజ్యోతి) : ముక్కంటి ఆలయాన్ని తెలుగు సినీ, జానపద గాయకులు రాహుల్ సిప్లిగంజ్ సోమవారం కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఆలయ అధికారులు ప్రత్యేక దర్శనం ఏర్పాట్లు చేశారు. దర్శనానంతరం మృత్యుంజయ స్వామి సన్నిధిలో వేద పండితులు శేష వస్త్రంతో సత్కరించి ఆశీర్వచనం అందజేశారు.

ఆగ్నేయ గణపతి సన్నిధిలో పంచనామా

శ్రీకాళహస్తి, జూన్ 30 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని బేరివారి మండపం వద్ద కొలువై ఉన్న ఆగ్నేయ గణపతి ఆలయంలో సోమవారం అధికారుల బృందం పంచనామా నిర్వహించారు. ముక్కంటి ఆలయానికి అనుబంధంగా చతుర్మాడ వీధుల్లో కొలువై ఉన్న నవ నంది వినాయకుల్లో భాగంగా ఉన్న ఆగ్నేయ గణపతి ఆలయ పునర్నిర్మాణ పనులకు సోమవారం శ్రీకారం చుట్టారు. ముందుగా వినాయక విగ్రహాన్ని భద్రపరిచేందుకు అధికారుల బృందం పంచనామా ప్రక్రియను లాంఛనంగా పూర్తి చేశారు.

పింఛన్లు సక్రమంగా పంపిణీ చేయండి

బుచ్చినాయుడుకండ్రిగ, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): ఎన్టీఆర్ భరోసా పింఛన్లను సక్రమంగా పంపిణీ చేయాలని ఎంపీడీవో వెంకటరత్నమ్మ తెలిపారు. మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం నూతనంగా విధుల్లో చేరిన కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండలంలో ఉదయం 6గంటల నుంచి ఇంటింటా పింఛన్లు పంపిణీ చేయాలన్నారు. మధ్యాహ్నంలోపు వందశాతం పూర్తి చేయాలన్నారు.

స్వయం ఉపాధితో మహిళల్లో ఆత్మ విశ్వాసం

నారాయణవనం, జూన్ 30(ఆంధ్రజ్యోతి): చేతివృత్తుల శిక్షణతో మహిళలు స్వయం ఉపాధి సాధికారతతో ఆత్మ విశ్వాసం పెరుగుతుందని జన్ శిక్షణ్ సంస్థాన్ డైరెక్టర్ మోహన్ పేర్కొన్నారు. సోమవారం నారాయణవనంలో రాస్ అనుబంధంగా ఉన్న జన్ శిక్షణ్ సంస్థాన్ ఆధ్వర్యంలో టైలరింగ్, ఆర్య వర్క్‌లో 80 రోజుల ఉచిత శిక్షణ శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. హరి, లోకనాథం, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

పేకాట స్థావరాలపై పోలీసుల దాడి

కేవీబీపురం, జూన్ 30 (ఆంధ్రజ్యోతి) మండలంలోని అంజూరులో పేకట స్థావరాలపై సోమవారం ఎస్ఐ నరేష్ సిబ్బందితో దాడి చేశారు. 10 మందిని అరెస్టు చేసి, 9 ద్విచక్ర వాహనాలను, ఆటోను, రూ.21950 ను స్వాధీనం చేసుకున్నారు. కానిస్టేబుళ్లు దయాకర్, అబ్దుల్‌కలాం, సురేష్, కేశవ తదితరులు పాల్గొన్నారు.

తుడా పనులను వేగవంతం చేయండి



నారాయణవనం, జూన్ 30(ఆంధ్రజ్యోతి): తమ నియోజకవర్గంలో తుడా ఆధ్వర్యంలో జరుగుతున్న పనులను వేగవంతం చేయాలని ఛైర్మన్ దివాకర రెడ్డిని నారాయణవనం జడ్పీటీసీ సభ్యుడు సుమన్ కుమార్ కోరారు. సోమవారం దివాకర రెడ్డిని తిరుపతిలోని తుడా కార్యాలయంలో మధ్యాహ్నం సుమన్‌కుమార్ మర్యాదపూర్వకంగా కలిసి సత్కరించారు. టీడీపీ నాయకులు మాణిక్యం రెడ్డి, ప్రసన్నకుమార్, నాదముని పాల్గొన్నారు.

క్షుద్ర పూజల కలకలం

సత్యవేడు, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో క్షుద్రపూజల కలకలం రేగింది. బీసీకాలనీలో ఓ ఇంటి ముందు ఆదివారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు పసుపు, కుంకుమతో ముగ్గులు వేసి, నాలుగు వైపులా నిమ్మకాయలు, జంతువుల పుర్రె, ఎముకలు ఉంచారు. తరచూ తమ ప్రాంతంలో క్షుద్ర పూజలు చేస్తున్నారని కాలనీవాసులు చెబుతున్నారు. పోలీసుల గస్తీ పెంచాల్సిన అవసరం ఉందంటున్నారు.

అలరించిన మత్స్య యంత్రచ్ఛేదనం




శ్రీకాళహస్తి, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని శ్రీకాళహస్తీశ్వరాలయానికి అనుబంధంగా కొలువై ఉన్న ద్రౌపది దేవి సమేత ధర్మరాజస్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం మత్స్యయంత్రచ్ఛేదనం కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ద్రౌపది స్వయంవరం సందర్భంగా ఏర్పాటు చేసిన మత్స్యయంత్రాన్ని అర్జునుడు ఛేదిస్తాడు. ఈ సుందరఘట్టాలు భక్తులను ఆకట్టుకున్నాయి. అనంతరం అర్జునుడికి అభిషేకాలు నిర్వహించి విశేష అలంకారం చేశారు. చప్పరంపై అధిష్ఠింపజేసి పట్టణంలో ఊరేగించారు.

గజ వాహనంపై పరాశరేశ్వరుడి దివ్య రూపం



నారాయణవనం, జూన్ 30(ఆంధ్రజ్యోతి): పట్టణంలో టీటీడీ అనుబంధ ఆలయమైన చంపకవల్లీ సమేత పరాశరేశ్వరస్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాల్లో సోమవారం గజవాహన సేవ ఘనంగా జరిగింది. ఉదయం స్వామిఅమ్మవార్లకు నిత్యకైంకర్యాలు నిర్వహించారు. అనంతరం స్వామిఅమ్మవారిని ఆలయ ప్రాంగణంలో ఊరేగించారు. సాయంత్రం 7 గంటలకు చంపకవల్లీ సమేత పరాశరేశ్వరస్వామిని వివిధ పుష్పాలతో అలంకరించి గజవాహనంపై అధిష్ఠింపజేసి పట్టణంలో ఊరేగించారు.

మృత్యుంజయుడికి విశేష పూజలు



శ్రీకాళహస్తి, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): ముక్కంటి ఆలయంలో కొలువై ఉన్న మృత్యుంజయుడికి సోమవారం విశేష పూజలు నిర్వహించారు. పరమశివునిడి ప్రీతికరమైన సోమవారం మృత్యుంజయ స్వామి సన్నిదిని అర్చకులు ముందుగా శుద్ధి చేశారు. అనంతరం వివిధ పూజ ద్రవ్యాలతో అభిషేకాలు నిర్వహించారు. ఆ తర్వాత ప్రత్యేక అలంకారం చేసి ధూప, దీప, నైవేద్య హారతులు సమర్పించారు. భక్తులు పెద్ద సంఖ్యలో దర్శించుకున్నారు.

సీపీఐ సభలను విజయవంతం చేయండి

రేణిగుంట, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): శత వత్సరాల సీపీఐ సభలను విజయవంతం చేయాలని ఆ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు హరినాథ రెడ్డి కోరారు. సోమవారం పట్టణంలోని పంచాయతీ కార్యాలయ ఆవరణలో జరిగిన సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. సీపీఐ జిల్లా కార్యదర్శి మురళి, నాయకులు గురవయ్య, రాధాకృష్ణ, తులసిరాజన్, మణి తదితరులు పాల్గొన్నారు.

'ఉపాధి'తో గ్రామాలను అభివృద్ధి చేద్దాం


సమావేశంలో మాట్లాడుతున్న మునిరాజా నాయుడు

శ్రీకాళహస్తి, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పనులతో గ్రామాలను ప్రణాళికాబద్ధంగా అభివృద్ధి చేద్దామని టీడీపీ తొట్టంబేడు మండల పార్టీ అధ్యక్షుడు రావిళ్ల మునిరాజానాయుడు పిలుపునిచ్చారు. ఉపాధి హామీ అధికారులతో కలిసి పంచాయతీ రాజ్ అతిథిగృహంలో మంగళవారం గ్రామాల అభివృద్ధిపై ఎంపీడీవో సురేంద్రనాథ్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మునిరాజానాయుడు మాట్లాడుతూ... ప్రతి పంచాయతీలో ఉపాధి హామీ పనులపై అవగాహన కల్పించాలన్నారు. తద్వారా ఉపాధి కూలీల సంఖ్యను మరింత పెంచుకోవచ్చన్నారు. టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గాలి చలపతి నాయుడు, మార్కెట్ కమిటీ మాజీ ఛైర్మన్ జయచంద్ర నాయుడు, నాయకుడు బాలాజీ రెడ్డి, ఉపాధి హామీ ఏపీఆర్‌ఓ ప్రీతిరెడ్డి, ఫీల్డ్, టెక్నికల్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

క్యాన్సర్ నిర్ధారణ ఉచిత పరీక్షలు

బుచ్చినాయుడుకండ్రిగ, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆలత్తూరు, గాజులపెళ్లూరుల్లో మహిళలకు స్విమ్స్, శ్రీబాలాజీ ఇనిస్టిట్యూట్ ఆఫ్ అంకాలజీ ఆధ్వర్యంలో మహిళలకు క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు ఉచితంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ మురళీధర్‌రెడ్డి మాట్లాడుతూ... ప్రభుత్వ ఆదేశాలతో రెండు పింక్ బస్సుల్లో నోరు, రొమ్ము, గర్భాశయ ముఖద్వారా క్యాన్సర్ పరీక్షలను ఉచితంగా నిర్వహించినట్లు తెలిపారు. ప్రాథమిక దశలో క్యాన్సర్‌ను గుర్తిస్తే తగిన వైద్యం అందించడం ద్వారా నివారించవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్లు ఉదయ్‌కుమార్, హరిత, చైతన్యభాను, సీహెచ్‌వో వెంకటేశ్వర్లు, సర్పంచులు రామ్మూర్తి, గంగయ్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

జూనియర్ కళాశాలలో అభివృద్ధి పనులకు కసరత్తు

పిచ్చాటూరు, జూన్ 30(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో తరగతి గదులు, ప్రహరీ నిర్మించనున్నారు. ఈ మేరకు సోమవారం సాయంత్రం సర్వశిక్షా అభియాన్ జిల్లా అడిషనల్ ప్రాజెక్టు కో-ఆర్డినేటర్ గౌరిశంకర్, ఏఎంవో శివశంకర్‌తో కలసి ఎమ్మెల్యే ఆదిమూలం కళాశాలను పరిశీలించారు. 25 ఏళ్ల క్రితం నాలుగు ఎకరాల్లో ప్రారంభమైన కళాశాలలో కేవలం 4 తరగతి గదులు మాత్రమే ఉన్నాయన్నారు వసతులు లేమిపై కళాశాల ప్రిన్సిపాల్ వెంకటసుబ్బమ్మ ఎమ్మెల్యే, పీడీకి వినతిపత్రం సమర్పించారు. తమ కళాశాల సజావుగా నిర్వహించేందుకు మరో నాలుగు తరగతిగదులు, ప్రహరీని నిర్మించాలని కోరారు. సోమవారం సాయంత్రం కళాశాలను పరిశీలించారు.

పద్మావతిపురం దారికి స్థల పరిశీలన

వరదయ్యపాళెం, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): తమ కాలనీకి దారి చూపాలంటూ పట్టణంలోని పద్మావతి పురంవాసులు ఇచ్చిన వినతి మేరకు రెవెన్యూ అధికారులు సోమవారం స్థల పరిశీలన చేశారు. పద్మావతిపురంలో స్థానిక అధికారపార్టీ నేత ఒకరు ఏర్పాటు చేసిన లేఅవుట్ కారణంగా దారి సమస్య ఏర్పడింది. దీంతో కాలనీవాసులు పట్టణానికి చేరుకోవాల్సిన దారిని వదులుకుని ఐదు కిలోమీటర్లు ప్రదక్షిణ చేయాల్సి వస్తుంది. ఇంతకు మునుపు లాగే దారి సౌకర్యం కల్పించాలని కోరుతూ తహసీల్దార్‌కు వినతి పత్రం అందించారు.

మూడు కంకర లారీల స్వాధీనం



సత్యవేడు, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): మండలంలో క్వారీల నుంచి తమిళనాడుకు కంకర తరలిస్తున్న మూడు టిప్పర్లను భూగర్భ వనరుల శాఖ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. సోమవారం పట్టణంలో మైనింగ్ అధికారులు ఉదయం నుంచి సాయంత్రం వరకు విస్తృతంగా దాడులు నిర్వహించారు. బిల్లులు సక్రమంగా లేని మూడు టిప్పర్లను స్వాధీనం చేసుకుని ఆర్టీసీ గ్యారేజ్ ఆవరణానికి తరలించారు. అయితే దాడుల వివరాలను మీడియాకు వెల్లడించకుండా గోప్యంగా వ్యవహరించడం గమనార్హం.

రెండు ఇసుక ట్రాక్టర్ల సీజ్



రేణిగుంట, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): నిబంధనలకు విరుద్ధంగా ఇసుకను తవ్వి తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను తహసీల్దార్ చంద్రశేఖర్ రెడ్డి సీజ్ చేశారు. సోమవారం సాయంత్రం మండలంలోని పిల్లపాళెం వద్ద స్వర్ణముఖి నది తీరంలో ఇసుక తరలిస్తుండగా సీజ్ చేసి తహసీల్దార్ కార్యాలయానికి తరలించారు. ఆర్ఐలు జయకృష్ణ, దిలీప్ తదితరులు పాల్గొన్నారు.